

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 05-04-2026 | సంపుటి - 27 | సంచిక -313 | రూ : 4 | పేజీలు: 8




## గడువు మీరొద్దు..
# నాణ్యత తగ్గొద్దు

- అమరావతి పనుల్లో జాప్యంపై గుత్తేదారు సంస్థలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం
- కఠిన చర్యలదాకా పరిస్థితి తెచ్చుకోవద్దని హితవు
- అగ్నిప్రమాద ఘటనలపై తీవ్ర అసంతృప్తి
- అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమీక్ష

2లో

## ప్రముఖ ఆలయాల పరిసరాల్లో...
# 'తిరుమల' నిబంధనలు

- బాసర ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండాలన్న ముఖ్యమంత్రి
- భవిష్యత్తు అవసరాలు, రద్దీ దృష్ట్యా విశాలమైన రోడ్లు ఉండాలన్న సీఎం
- ఆలయ పరిసరాల్లో విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని సూచన

2లో






## చిన్న సిలిండర్..
## ఇక ఈజీ!

- ఏదైనా ఐడీ కార్డుతో 5 కేజీల ఎల్పీజీ సిలిండర్
- అడ్రస్ ప్రూఫ్ అవసరం లేదని స్పష్టం చేసిన కేంద్రం
- దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కు కొరత లేదు
- ఆందోళన చెంది అధికంగా కొనవద్దని ప్రజలకు విజ్ఞప్తి
- అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు

2లో




2లో

## ట్రంప్ వార్నింగ్
# ఇరాన్‌కు 48 గంటలే టైమ్!

- హర్మూజ్ జలసంధిని మూసివేయవద్దని ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక
- 48 గంటల్లో నరకం చూపిస్తామని, 20 రెట్ల బలంతో దాడి చేస్తామని స్పష్టీకరణ
- ప్రపంచ చమురు సరఫరాపై ప్రభావంతో పెరుగుతున్న గ్యాస్ ధరలు
- అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో తాజా పరిణామాలు

# శాశ్వత పరిష్కారం కావాలి
## ఇరాన్ విదేశాంగ మంత్రి స్పష్టం

- యుద్ధానికి శాశ్వత ముగింపు కావాలన్న ఇరాన్ విదేశాంగ మంత్రి
- చర్చలకు నిరాకరించినట్టు వస్తున్న వార్తలను ఖండన
- టెహ్రాన్‌లోని కీలక సైనిక స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు
- ఇరాన్ పెట్రోకెమికల్ కంపెనీలపై దాడిలో పలువురికి గాయాలు
- రెండు అమెరికా యుద్ధ విమానాలను కూల్చివేసినట్లు వెల్లడి

2లో



## లోక్‌సభ సీట్లు తగ్గవు: మోదీ



- పథనంథిట్టలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మోదీ
- కేరళలో ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలైందని వ్యాఖ్య
- ఎన్డీయే అధికారంలోకి వస్తే ఈశాన్య రాష్ట్రాల మాదిరి అభివృద్ధి చేస్తామని వ్యాఖ్య

2లో

## ట్రంప్ తోనే మీకు ప్రమాదం..
## మిస్సింగ్ పైలట్ తల్లికి ఇరాన్ సందేశం

ఇరాన్ చేతిలో కూలిపోయిన రెండు అమెరికన్ ఫైటర్ జెట్లు

2లో

## ఆయనకు మనం ఎప్పుడూ
# అండగా ఉండాలి: మంత్రి లోకేశ్

- కేంద్ర మంత్రి కుమారస్వామికి అండగా ఉండాలని లోకేశ్ పిలుపు
- విశాఖ ఉక్కును కాపాడింది ఆయనేనని ప్రశంస
- కర్ణాటకలో సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏపీ మంత్రి
- రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీతోనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్య



2లో



2లో

## నాసా ప్రయోగానికి
# ఇస్రో చీఫ్ జేజేలు

- నాసా ఆర్టెమిస్2 ప్రయోగాన్ని ప్రశంసించిన ఇస్రో ఛైర్మన్
- ఈ ప్రయోగం ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేసిన నారాయణన్
- 50 ఏళ్ల తర్వాత తొలిసారిగా చంద్రుడి చుట్టూ వ్యోమగాముల యాత్ర
- గగన్‌యాన్ వ్యోమగాములకు లద్దాఖ్‌లో 'మిషన్ మిత్ర' కింద ప్రత్యేక శిక్షణ

# నాసా ప్రయోగానికి ఇస్రో చీఫ్ జేజేలు

హైదరాబాద్, ఏప్రిల్ 4 అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) చేపట్టిన 'ఆర్టెమిస్2' ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ వి. నారాయణన్ ప్రశంసించారు. మానవాళి పురోగతిలో ఇదొక కీలక ముందడుగు అని అభివర్ణించారు. ఈ ప్రయోగం కచ్చితంగా ఘన విజయం సాధిస్తుందన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 2న ఫ్లోరిడా నుంచి నింగిలోకి దూసుకెళ్లిన ఈ ప్రయోగాన్ని తాను కూడా టెలివిజన్‌లో వీక్షించినట్లు తెలిపారు. 50 ఏళ్లకు పైగా సుదీర్ఘ విరామం తర్వాత, నలుగురు వ్యోమగాములతో చంద్రుడి కక్ష్యలోకి మానవసహిత యాత్రను నాసా చేపట్టింది. ఈ నలుగురి బృందంలో నాసా వ్యోమగాములు రీడ్ వైజ్‌మన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్‌తో పాటు కెనడియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన జెరెమీ హాన్సెన్ ఉన్నారు. ఈ క్రమంలో, శనివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఇస్రో ఛైర్మన్ నారాయణన్, "1969లో తొలిసారిగా మనిషి చంద్రుడిపై కాలుమోపాడు. మళ్లీ 57 ఏళ్ల తర్వాత ఆర్టెమిస్ కార్యక్రమం ద్వారా చంద్రుడి వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ దిశగా చేపట్టిన ఈ ఆర్బిటాల్ మిషన్ చాలా ముఖ్యమైనది" అని అన్నారు. గతంలో తాను కెనడియన్ స్పేస్ ఏజెన్సీని సందర్శించినప్పుడు, నిర్మాణ దశలో ఉన్న ఆర్టెమిస్2 ప్రయోగ వాహనాన్ని చూసే అవకాశం తనకు లభించిందని నారాయణన్ గుర్తు చేసుకున్నారు. "మానవ శాస్త్రీయ అన్వేషణలో ఇదొక గొప్ప ప్రయత్నం. ఈ ప్రయోగం 100 శాతం విజయవంతమై, భవిష్యత్తులో చంద్రుడిపై మనిషిని దించేందుకు మార్గం సుగమం చేస్తుందని నేను నమ్ముతున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

**గగన్‌యాన్‌పై కీలక అప్‌డేట్**

భారత్ చేపడుతున్న తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్' పురోగతిని కూడా నారాయణన్ వివరించారు. ఈ మిషన్ కోసం ఎంపికైన నలుగురు వ్యోమగాములు ప్రస్తుతం లఢఖ్‌లో 'మిషన్ మిత్ర'లో భాగంగా ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారని తెలిపారు. "రెండు రోజుల క్రితమే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. వారు దాదాపు 4 కిలోమీటర్ల ఎత్తులో అత్యంత కఠినమైన శిక్షణ పొందుతున్నారు. ఇది వ్యోమగాముల శిక్షణా కార్యక్రమంలో ఒక ముఖ్యమైన భాగం" అని ఆయన వివరించారు. ఈ కొత్త ఆర్థిక సంవత్సరంలో ఇస్రో మరిన్ని ప్రయోగాలు చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తోందని, ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో దేశ అంతరిక్ష లక్ష్యాలను సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని నారాయణన్ స్పష్టం చేశారు.

# గడువు మీరొద్దు.. నాణ్యత తగ్గొద్దు

అమరావతి : రాజధాని నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తున్న గుత్తేదారు సంస్థల ప్రతినిధులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నిసార్లు చెప్పినా సీరియస్‌నెస్ రావడం లేదని, ఇకపై లక్ష్యానికి తగ్గట్టు పనులు చేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమరావతి పనుల పురోగతిపై ముఖ్యమంత్రి శనివారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, ఉన్నతాధికారులతో కలిసి అధికారులు, గుత్తేదారు సంస్థల ప్రతినిధులతో సమీక్షించారు. 'రాజధాని పనుల్లో కొన్ని సంస్థలు లక్ష్యానికంటే బాగా వెనుకబడ్డాయి. పనుల నాణ్యతలో తేడా వచ్చినా, సీరియస్‌నెస్ లేకపోయినా చర్యలు తప్పవు. పరిస్థితి అంతదాకా తెచ్చుకోవద్దు' అని మందలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనుకున్న సమయానికి నిర్మాణాలు పూర్తి కావాల్సిందేనని స్పష్టంచేశారు. రాజధానిలో వరస అగ్ని ప్రమాదాలు, నిర్మాణ సామగ్రి కాలిపోవడంపై తీవ్రంగా మండిపడ్డ సీఎం.. తగిన రక్షణ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కంపెనీలకు లేదా అని నిలదీశారు.

**మీ నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు**

ఇటీవలి అగ్ని ప్రమాదాలు, ఆనక నిర్మాణ సంస్థల ప్రతినిధులు స్పందించిన తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మీ నిర్లక్ష్యం వల్ల మీకు నష్టమే కాదు, ప్రభుత్వానికీ చెడ్డపేరు వస్తోంది. రాజధానిలో శాంతిభద్రతల నిర్వహణ సరిగ్గా లేదన్న భావన ప్రజల్లో కలుగుతుంది. రాజధానిలో ఎప్పుడేం జరుగుతుందా? ఎప్పుడు బురదజల్లుదామా అని విపక్షం కాచుక్కూర్చుంది. వాళ్లు ప్రతిదీ రాజకీయం చేస్తున్నారు. చిన్న ఘటననూ భూతద్దంలో చూపిస్తారు. రాజధానిలో నిర్మాణ సామగ్రిని నేనే తగలబెట్టించానని ప్రచారం చేసినా ఆశ్చర్యం లేదు. మీ అజాగ్రత్త వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తే సహించను' అని హెచ్చరించారు. నిర్మాణాల్లో జాప్యంపై ఎన్నిసార్లు హెచ్చరించినా కొన్ని సంస్థలు పట్టించుకోవడం లేదని, ప్రాజెక్టు మేనేజర్లుగా సరైన వ్యక్తుల్ని పెట్టుకోవడం లేదని ఏడీసీఎల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి ప్రస్తావించారు. సీఎం స్పందిస్తూ ప్రాజెక్టు మేనేజర్లు సరిగ్గా లేక పనులపై ప్రభావం పడటాన్ని సహించబోమని స్పష్టంచేశారు.

**మీరంతా చరిత్రలో భాగస్వాములు..**

రాజధానిలో నిర్మాణాలను సకాలంలో పూర్తిచేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తామని, దీన్ని దృష్టిలో ఉంచుకుని వేగం పెంచాలని సీఎం ఆదేశించారు. అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. 'గతంలో మీరు ఎన్నో ప్రాజెక్టులు చేపట్టి ఉండొచ్చు. ఈ పనులను కేవలం ఒక కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దు. చరిత్రలో భాగస్వాములం అవుతున్నామన్న భావనతో చేయాలి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా రూపొందించాలన్న ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలుచేసి చూపాలి. నిర్మాణంలో నాణ్యత పాటించాలి. గ్రీన్‌ఎనర్జీ, ఆధునిక సాంకేతికతను వాడుకోవాల'ని సూచించారు.

రాజధాని అమరావతి పనులపై క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నారాయణ. సీఆర్డీయే, ఏడీసీ ఉన్నతాధికారులు, పనులు చేస్తున్న సంస్థల ప్రతినిధులు

**స్థానిక కార్మికుల్ని నియమించుకోండి**

నివాస భవనాలు, రహదారులు వంటి ప్రధాన మౌలిక వసతులు, ఎల్పీఎస్ లేఅవుట్లతో పాటు ఐకానిక్ భవనాలైన శాసనసభ, హైకోర్టు, సచివాలయం, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణ పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. 'ఇప్పటి వరకు రూ.50,943 కోట్ల విలువైన పనులు మొదలయ్యాయి. 20 వేల మంది కార్మికులు, నిపుణులు పనిచేస్తున్నార'ంటూ అధికారులు వివరించారు. కాంట్రాక్టు సంస్థల వారీగా చేపట్టిన నిర్మాణాలు, పురోగతిని సీఎం ముందుంచారు. కార్మికుల కొరతను సీఎం దృష్టికి తేగా, స్థానికంగా నైపుణ్యమున్న వారితో పనులు చేయించాలని సూచించారు. 5,580 యంత్రాలు అవసరం కాగా, ప్రస్తుతం 3,767 యంత్రాలు పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు.

# "శాశ్వత పరిష్కారం కావాలి: ఇరాన్ విదేశాంగ మంత్రి స్పష్టం"

టెహ్రాన్, ఏప్రిల్ 04 : అమెరికాతో చర్చలకు ఇరాన్ నిరాకరించిందంటూ వస్తున్న వార్తలను ఆ దేశం ఖండించింది. చర్చలకు తాము ఎప్పుడూ సిద్ధమేనని, అయితే తమపై బలవంతంగా రుద్దిన ఈ యుద్ధానికి శాశ్వత ముగింపు పలకడమే తమ ప్రధాన లక్ష్యమని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి శనివారం స్పష్టం చేశారు. అమెరికా మీడియా తమ వైఖరిని తప్పుగా చిత్రీకరిస్తోందని ఆయన ఆరోపించారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇస్లామాబాద్‌లో అమెరికా అధికారులతో జరిగే చర్చలకు ఇరాన్ హాజరుకావడం లేదని వాల్ స్ట్రీట్ జర్నల్ కథనాన్ని ప్రచురించింది. ఈ కథనాన్ని ఖండిస్తూ అరాఘ్చి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో ఒక ప్రకటన విడుదల చేశారు. "చర్చల కోసం ఇస్లామాబాద్ వెళ్లడానికి మేము ఎప్పుడూ నిరాకరించలేదు. మధ్యవర్తిత్వ ప్రయత్నాల కోసం పాకిస్థాన్‌కు మేం కృతజ్ఞతలు తెలుపుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న టెహ్రాన్‌తో పాటు ఇతర ఇరాన్ నగరాలపై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేయడంతో ఈ వివాదం మొదలైంది. ఈ దాడుల్లో ఇరాన్ అత్యున్నత నాయకుడు అలీ ఖొమైనీ మరణించారు. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్, మధ్యప్రాచ్యంలోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తోంది. "మాపై రుద్దిన ఈ చట్టవిరుద్ధమైన యుద్ధానికి శాశ్వతమైన, నిశ్చయాత్మకమైన ముగింపు పలికే నిబంధనలే మాకు ముఖ్యం" అని అరాఘ్చి తన ప్రకటనలో స్పష్టంగా పేర్కొన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణ కన్నా, యుద్ధాన్ని పూర్తిగా ఆపే ఒప్పందంపైనే తమ దృష్టి ఉందని ఆయన పరోక్షంగా తేల్చిచెప్పారు.

# ఆయనకు మనం ఎప్పుడూ అండగా ఉండాలి: మంత్రి లోకేశ్

సింధనూరు (కర్ణాటక), ఏప్రిల్ 4 : కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి హెచ్. డి. కుమారస్వామికి మనమందరం అండగా నిలవాలని ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కుమారస్వామి కాపాడారని, ఆయన కేంద్ర మంత్రిగా ఉండటం మన అదృష్టమని లోకేశ్ అన్నారు. కుమారస్వామికి ఎప్పుడూ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. కర్ణాటకలోని సింధనూరు హోసళ్లీ క్యాంపులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్‌ను శనివారం లోకేశ్ ప్రారంభించారు. కేంద్ర మంత్రి కుమారస్వామి, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేశ్ ప్రసంగించారు. కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని ఆయన కొనియాడారు. దేశం కోసం సైనికులు చేస్తున్న ప్రాణత్యాగాలను ఎప్పటికీ మర్చిపోకూడదని అన్నారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు.

# చిన్న సిలిండర్.. ఇక ఈజీ!



ఢిల్లీ, ఏప్రిల్ 4 : పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇకపై 5 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌ను అడ్రస్ ప్రూఫ్ అవసరం లేకుండా, కేవలం ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని శనివారం స్పష్టం చేసింది. సమీపంలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల వద్ద ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని, అయితే దేశంలో పెట్రోల్, డీజిల్ లేదా ఎల్పీజీకి ఎలాంటి కొరత లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ప్రజలు ఆందోళన చెంది ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రిటైల్ ఔట్‌లెట్లు సాధారణంగా పనిచేస్తున్నాయని, తగినన్ని నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. ముఖ్యంగా వలస కార్మికులు, స్థానిక చిరునామా పత్రాలు లేని వారిని దృష్టిలో ఉంచుకుని 5 కేజీల సిలిండర్ నిబంధనను సరళతరం చేసినట్లు అధికారులు వివరించారు. మార్చి 23 నుంచి ఇప్పటివరకు సుమారు 5.7 లక్షల సిలిండర్లను ఈ పద్ధతిలో విక్రయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇంధన సరఫరాలో స్థిరత్వాన్ని కొనసాగించడానికి దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామని, రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని కేంద్రం తెలిపింది. మరోవైపు, అక్రమ నిల్వలు, నల్ల బజారును అరికట్టేందుకు నిఘా పెంచామని, ఇటీవల 3,700కు పైగా దాడులు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. నిత్యావసర వస్తువుల చట్టం కింద చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించినట్లు పేర్కొంది.

## ట్రంప్ వార్నింగ్
# ఇరాన్‌కు 48 గంటలే టైమ్!

వాషింగ్టన్/దుబాయ్, ఏప్రిల్ 04: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌కు అత్యంత తీవ్రమైన హెచ్చరిక జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని మూసివేసే ప్రయత్నం చేస్తే కేవలం 48 గంటల్లో ప్రళయం తప్పదని, నరకం చూపిస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి ద్వారా సరఫరాను అడ్డుకుంటే, అమెరికా 20 రెట్లు ఎక్కువ బలంతో ప్రతిదాడి చేస్తుందని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న తరుణంలో ఈ హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇప్పటికే ఇరాన్ చర్యల వల్ల హర్మూజ్ జలసంధిలో చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరిగాయి. "ఇక ఆలస్యం కాకముందే ఓ ఒప్పందానికి రండి" అంటూ ట్రంప్ ఇరాన్‌కు సూచించారు. యుద్ధం నాలుగో వారానికి చేరిన నేపథ్యంలో, అవసరమైతే ఇరాన్‌లోని పవర్ ప్లాంట్లపై కూడా దాడి చేస్తామని ట్రంప్ గతంలో బెదిరించారు. అంతేకాకుండా, హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికా తీసుకోదని, చమురు అవసరమైన దేశాలు తమ నౌకలను తామే రక్షించుకోవాలని లేదా అమెరికా నుంచి చమురు కొనుగోలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ట్రంప్ హెచ్చరికలతో అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. యుద్ధం కారణంగా ఇప్పటికే దెబ్బతిన్న ఇరాన్ చమురు ఎగుమతులపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ట్రంప్ తోనే మీకు ప్రమాదం...
# మిస్సింగ్ పైలట్ తల్లికి ఇరాన్ సందేశం

- **ఇరాన్ చేతిలో కూలిపోయిన రెండు అమెరికన్ ఫైటర్ జెట్లు**
- **కొడుకు గల్లంతు కావడంతో ఆందోళన వ్యక్తం చేసిన పైలట్ తల్లి**
- **ట్రంప్ కంటే మా వద్దే మీ కొడుకు సురక్షితం అంటూ ఇరాన్ స్పందన**
- **తమది నాగరిక సంస్కృతి అని స్పష్టం చేసిన ఇరాన్ రాయబార కార్యాలయాలు**

వాషింగ్టన్/టెహ్రాన్, ఏప్రిల్ 4 : అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధ జ్వాలలు ఇప్పట్లో చల్లారేట్లు లేవు. శుక్రవారం నాడు తమ దళాలు రెండు అమెరికన్ సైనిక విమానాలను కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించడంతో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ ఘటనలో ఒక పైలట్‌ను రక్షించగా, మరొకరు గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో, తన కొడుకు (పైలట్) ఆచూకీ తెలియడం లేదంటూ ఓ అమెరికన్ మహిళ సోషల్ మీడియాలో వ్యక్తం చేసిన ఆవేదనకు ఇరాన్ రాయబార కార్యాలయాలు ఊహించని రీతిలో సమాధానం ఇచ్చాయి. "ఈ రాత్రి కూల్చివేయబడిన రెండు ఎఫ్15 విమానాల పైలట్ల కోసం ప్రార్థించండి. నా కొడుకుల్లో ఒకడు ఫైటర్ పైలట్. అతని నుంచి లేదా అతని యూనిట్ నుంచి ఇంకా ఎలాంటి సమాచారం రాలేదు. నా గుండె ఆందోళనతో నిండిపోయింది," అంటూ ఆ తల్లి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ పోస్టుపై పాకిస్థాన్‌లోని ఇరాన్ ఎంబసీ తీవ్రంగా స్పందించింది. "మీ కొడుకులు డొనాల్డ్ ట్రంప్ వద్ద కంటే ఇరాన్ కస్టడీలో ఎక్కువ సురక్షితంగా ఉంటారని నమ్మండి. అతను అమెరికన్ రెస్క్యూ టీముల చేతిలో పడకుండా, ఇరాన్ చేత బంధించబడి ఉండాలని ప్రార్థించండి. ముస్లింలుగా, నాగరిక ఇరానియన్లుగా బందీలను గౌరవంగా ఎలా చూసుకోవాలో మాకు తెలుసు," అని పేర్కొంది. ఇదే తరహాలో దక్షిణాఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ కూడా, "మేము బందీలతో జియోనిస్టుల్లా వ్యవహరించం. మాకు ఇరానియన్ నాగరికత ఉంది. అమెరికాలా రాతియుగంలో జీవించడం లేదు" అని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా ఇజ్రాయెల్ దళాలు జరిపిన దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణించినప్పటి నుంచి ఈ యుద్ధం కొనసాగుతోంది. అప్పటి నుంచి మధ్యప్రాచ్యం అంతటా ఇరాన్ ప్రతీకార దాడులకు దిగుతోంది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు 1,900 మందికి పైగా మరణించారు. గల్లంతైన పైలట్ కోసం అమెరికా డ్రోన్లు, విమానాలతో ముమ్మరంగా గాలిస్తోంది. మరోవైపు, ఆ పైలట్ పారాషూట్‌తో దిగినట్లు తమ వద్ద సమాచారం ఉందని, అతన్ని సజీవంగా అప్పగిస్తే బహుమతి ఇస్తామని ఇరాన్ మీడియా ప్రకటించడం గమనార్హం. ఓ సైనిక ఘటనకు మానవత్వపు కోణాన్ని జోడిస్తూనే, తమ ప్రచారాన్ని ఇరాన్ బలంగా వినిపించడం ఈ ఘటనలో కీలకాంశంగా మారింది.

# లోక్‌సభ సీట్లు తగ్గవు: మోదీ

పథనంథిట్ట (కేరళ) : జనాభా నియంత్రణ వల్ల దక్షిణాది రాష్ట్రాలు లోక్ సభ సీట్లను కోల్పోతాయనే వాదనలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. పథనంథిట్టలోని తిరువళ్ల మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, కేరళలో ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలైందని అన్నారు. ఇక్కడ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ఈశాన్య రాష్ట్రాల్లో మాదిరి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికాఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం అంశంతో భయాన్ని సృష్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళలో శబరిమల రైల్వే ప్రాజెక్టు కొత్త అవకాశాలను తీసుకువస్తుందని అన్నారు. ఇది శబరిమలకు ప్రత్యేక అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని అన్నారు. దీని ద్వారా స్థానిక వ్యాపారాలు ఊపందుకుంటాయని, యువతకు కొత్త ఉపాధి మార్గాలు వస్తాయని ఆయన అన్నారు. ఇలాంటి ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం అసంపూర్ణంగా వదిలేసిందని విమర్శించారు. కేరళలో బీజేపీ గెలిస్తే, డబుల్ ఇంజిన్ సర్కార్ అవుతుందని, అప్పుడు అడ్డంకులన్నీ తొలగిపోతాయని ప్రధాని మోదీ అన్నారు.

# ప్రముఖ ఆలయాల పరిసరాల్లో... 'తిరుమల' నిబంధనలు

హైదరాబాద్/బాసర, అక్టోబర్ 4 : హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల పరిసరాల్లో తిరుమల తరహా నిబంధనల్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవాదాయ శాఖను ఆదేశించారు. దేవాలయాల వద్ద రాజకీయ సభలు, జెండాలు, ప్రదర్శనలను పూర్తిగా నిషేధిస్తూ ఆధ్యాత్మిక వాతావరణానికి పెద్దపీట వేయాలని సూచించారు. బాసరలోని జ్ఞాన సరస్వతి ఆలయ అభివృద్ధి పనులపై శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్ష సందర్భంగా సీఎం ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. బాసర ఆలయాన్ని సంప్రదాయాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలన్నారు. తొలుత దేవాదాయశాఖ అధికారులు బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. ఆలయ అభివృద్ధి పనులకు రూ.225 కోట్ల వ్యయం అవుతుందని తెలిపారు. మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి.. పలు మార్పులు సూచించారు. భవిష్యత్ అవసరాలు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విశాలమైన రోడ్లు నిర్మించాలని ఆదేశించారు. 'ఎంతటి ప్రముఖుల వాహనాలైనా ఆలయ ప్రాంగణానికి బయటే నిలిచిపోవాలి. ఆలయ ప్రాంగణంలోకి కేవలం ఎలక్ట్రిక్ వాహనా(ఈవీ)ల ద్వారానే చేరుకునేలా చర్యలు తీసుకోవాలి' అని సీఎం అధికారుల్ని ఆదేశించారు. 'ఇందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలి. వాహనాల పార్కింగ్ ప్రదేశంలో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయాలి. ఆలయ ప్రాంగణం భవిష్యత్‌లో భారీ వృక్షాలతో పరిఢవిల్లేలా అవసరమైన మొక్కలు నాటాలి. ఆలయం సమీపంలో హెల్త్ సెంటర్ నిర్మించాలి. పుష్కరాలు, ఇతర ఉత్సవాల రోజుల్లో అక్కడ వైద్యులు, వైద్య సిబ్బంది ఉండాలి. అభివృద్ధి పనుల సమయంలో ఆలయ పవిత్రతకు ఎటువంటి భంగం కలగకుండా జాగ్రత్త పడాలి' అని రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమీక్షలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, సీఎం ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షున్ని సన్మానించిన అవోపా



ప్రజాస్ఫూర్తి, కూకట్ పల్లి : ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా గెలుపొందిన అమరవాది లక్ష్మీనారాయణను శనివారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్ ఇతర కమిటీ సభ్యులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తన గెలుపు కోసం పని చేసిన అవోపా రాష్ట్ర అధ్యక్షుడు , ఇతర సభ్యులు ఇకముందు తాను చేయబోయే ఆర్యవైశ్యుల అభివృద్ధి కి సహకరించాలన్నారు. అనంతరం అవోపా శంకర్ మాట్లాడుతూ తెలంగాణ లో అవోపా ఆర్యవైశ్య మహాసభ అనుభంద సంస్థలా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోల శ్రీధర్, జోనల్ చైర్మన్ అగీర్ అశోక్ కుమార్, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుదు మనోహర్రావు, ప్రధాన కార్యదర్శి దుబ్బ అనిల్ కుమార్, ఫైనాన్స్ సెక్రటరీ శివకుమార్, ఆర్గనైజేషన్ సెక్రెటరీ నాగేంద్రయ్య, రంగారెడ్డి జిల్లా అర్బన్ టు అధ్యక్షులు బొడ్డు శ్రీధర్, ఫైనాన్స్ సెక్రటరీ ఇడుకుల లింగయ్య, ఆర్కే పురం అధ్యక్షుడు గట్టు హరీష్, ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్ , శంకర్, పుప్పాలగూడ యూనిట్ అధ్యక్షుదు దారం వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# మీనాక్షి ఎస్టేట్ కాలనీ పార్క్ ను సందర్శించిన ఎస్ఎంసీ కమిషనర్



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో 30వ రోజు శనివారం సైబరాబద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని జీడిమెట్ల సర్కల్ లో ప్రత్యేక డ్రైవ్ క్లీనింగ్ పార్క్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్కులను శుభ్రపరచడం , నిర్వహణ కోసం పార్కులను గుర్తించడం భాగంగా సైబరాబద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన పాల్గొని మీనాక్షి ఎస్టేట్ కాలనీ పార్క్ ను సందర్శించారు. అనంతరం పార్క్ లో ప్రజలతో ముఖాముఖీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి శంకర్ సింగ్, యుబిడి మేనేజర్ మహేందర్ , డీప్యూటి ఈఈ ఎస్డబ్ల్యుఎం ఖాసిఫ్ హుస్సైన్ , ఎఈ సాయి లికిత, జవాన్ జిలానీ పాషా తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిచాలి

**: టీడబ్ల్యుజేఎఫ్**



ఖమ్మం జిల్లా, ప్రజాస్ఫూర్తి : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరిచాలని టీడబ్ల్యుజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు . శనివారం ఖమ్మంలో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రిడేషన్ కార్డుల జారీ, సంక్షేమ పథకాల అమలులో జాప్యం తగదన్నారు . అనంతరం జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా నాలబాల రామకృష్ణ , ప్రధాన కార్యదర్శిగా ఆర్కపల్లి నగేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఖమ్మంలో అంతర్జాతీయ స్థాయి సింథటిక్ ట్రాక్



ఖమ్మం జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో రూ . 8.50 కోట్లతో నిర్మించిన అంతర్జాతీయ స్థాయి సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ అందుబాటులోకి వచ్చింది . అత్యాధునిక వసతులతో కూడిన ఈ ట్రాక్ పై వర్షం కురిసినా సాధన చేసే వీలుంది . ఇన్నాళ్లు మెట్రో నగరానికే పరిమితమైన ఇలాంటి వసతి ఇప్పుడు ఖమ్మం క్రీడాకారులకు లాభించడంతోవారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు . ఈ ట్రాక్ తో అథ్లెట్లు అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటే అవకాశం మెరుగుపడుతుంది.

# గాయపడిన క్రీడాకారుడికి పరామర్శ



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: చత్తీస్ఘడ్ రాష్ట్రంలో గత నెల 28న ప్రారంభమైన కేలో ఇండియా ట్రైబల్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకారుడు ఏ.వెంకటప్రసాద్ గాయపడగా శనివారం అతడిని టీపీసీసీ కార్యదర్శి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నాగ సీతారాములు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేలో ఇండియా రెజ్లింగ్ పోటీలలో పలు విభాగాలలో సత్తా చాటి రెండు రౌండ్లు క్రీడాకారులపై ఆధిపత్యం సాధించి గెలుపొందగా క్వార్టర్ ఫైనల్ రౌండ్ పోటీలో తలపడుతుండగా వెంకటప్రసాద్ కాలు మణికట్టు వద్ద ఫ్రాక్చర్ అయిందని చెప్పారు. జాతీయస్థాయిలో జిల్లా కీర్తిని చాటిచెప్పిన వెంకట ప్రసాద్ త్వరగా కోలుకుని మళ్లీ రెజ్లింగ్ పోటీలలో పాల్గొని సత్తా చాటి పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు సీతారాములు వెంట జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీ హుస్సేన్, ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, కోచ్, సీనియర్ క్రీడాకారులు ఉన్నారు.

# నల్లగొండ జిల్లా జైలులో ఉచిత వైద్య శిబిరం





నల్లగొండ,ప్రజాస్ఫూర్తి:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక - 99 రోజుల కార్యాచరణలో భాగంగా, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కారాగారంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నీలగిరి బ్రాంచ్ ఆధ్వర్యంలో, జిల్లా కారాగారం పర్యవేక్షణ అధికారి కూన ఆనందరావు అధ్యక్షతన, కారాగార వైద్య అధికారి డాక్టర్ సట్టు కిరణ్ కుమార్ సారథ్యంలో వైద్య శిబిరం నిర్వహించారు . ఈ శిబిరంలో ఖైదీలకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు.ఈ సందర్భంగా జనరల్ ఫిజీషియన్, ఆప్తల్మాలజిస్ట్ (కంటి వైద్యులు), మానసిక వైద్యులు, ఈఎన్టి నిపుణులు, ఎముకల వైద్యులు (ఆర్థోపెడిక్ వైద్యులు), స్త్రీల వైద్య నిపుణులు (గైనకాలజిస్టులు) ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి మందులను అవసరమైన వారికి అందజేశారు. ఈ వైద్య శిబిరంలో డా. సుబ్బారావు (మానసిక వైద్యుడు), డా. వి. వినోద్ కుమార్ ( ఈ న్ టీ నిపుణుడు), డా. పుల్లారావు (కంటి వైద్యుడు), డా. రమేష్ (క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ ఫిజీషియన్), డా. శంకర్ (ఫిజీషియన్), డా. విశ్వజ్యోతి (స్త్రీల వైద్య నిపుణులు), డా. రామచంద్ర (ఆర్థోపెడిక్ వైద్యుడు), డా. జి. ప్రవీణ్ (జనరల్ సర్జన్), డా. భరద్వాజ్ (డెంటల్ సర్జన్), డా. వంశీ (డెంటల్ సర్జన్), డా. శ్రీవాస్తవ (ఫిజీషియన్ జిల్లా కారాగారం జైలర్ బాలకృష్ణ డిప్యూటీ జైలర్లు వెంకట్ రెడ్డి, సుబ్బరాజు, మెడికల్ సిబ్బంది సీతారామ్, లింగయ్య, పోలీసు సిబ్బంది సైదులు, గిరిబాబు, సురేష్, రాంబాబు, కర్ణాకర్, శ్రావణ్, జయప్రకాష్ రెడ్డి, గణేశ్, శ్రీకాంత్ కోటి తదితరులు పాల్గొన్నారు.

# కోట్లాది రూపాయలతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ను అభివృద్ధి పరిచాం

*** బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరచామని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మధురానగర్ లో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ శనివారం కాలనీలో పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలు తెలుసుకొని సమస్యల పరిష్కారానికి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ల నిర్మాణం మరమ్మత్తులు, పారిశుద్ధ నిర్వాహణ, దోమల బెడద, వీధి దీపాల మరమ్మతులు, మంజీరా నీటి ప్రెజర్, స్మశాన వాటికల అభివృద్ధి, సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ల నిర్వహణ, వెజ్ & నాన్ వెజ్ మార్కెట్ల ఏర్పాటు, చెరువుల సుందరీకరణ వంటి మౌలిక వసతుల కల్పనపై సమీప కాలనీల వాసులు వారి సమస్యలను విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతుల కల్పనతో పాటు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో కూడా మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. గ్రామ పంచాయతీ నుంచి కార్పొరేషన్, నేడు జిహెచ్ఎంసి విలీనం వరకు నిజాంపేట్ కార్పొరేషన్ ఎంతో అభివృద్ధి చెందిందని, పెరుగుతున్న జనాభా, పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధిపరిచి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఉప కమిషనర్ సాబేర్ అలీ, ఇంజనీరింగ్ ఏఈ ప్రవీణ్ కుమార్, ఎస్.డబ్ల్యూ.ఎం శరన్ తేజ, నిజాంపేట్ సర్కిల్ కు చెందిన వివిధ విభాగాల అధికారులు, స్థానిక కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆటల పోటీలలో పాల్గొనడం మానసికోల్లాసం కలుగుతుంది

*** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర**

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ఆటల పోటీలలో పాల్గొనడం వల్ల దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని, మరింత ఆరోగ్యవంతులవుతారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. జిల్లా కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో శనివారం ఆయన గాయత్రి క్రికెట్ ఛాంపియన్స్ ట్రోఫీ-2026 పోటీలను ప్రారంభించారు. తొలుత అమరవీరుల స్థూపానికి పూలుజల్లి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ రవిచంద్ర టాస్ వేసి, బ్యాటింగ్ చేసి ఛాంపియన్స్ ట్రోఫీని ప్రారంభించారు. పోటీల నిర్వాహకులు బీ.శ్రీనివాస్, కన్నిలు క్రికెట్ టీం సభ్యులను ఎంపీకి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అంతర్జాతీయ క్రికెట్ లో భారత జట్టు అత్యుత్తమ ప్రతిభాపాటవాలు కనబర్చుతున్నదని కొనియాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, ఈ రంగంలో కూడా గొప్పగా ఎదగడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దిండిగల రాజేందర్, వనమా రాఘవ, కాపు సీతామహాలక్ష్మీ, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, రంగనాథ్, బాదావత్ శాంతి నాయక్, కార్పొరేటర్లు మల్హోత్రా సాగర్, కాలేరు సింధూ తపస్వి, బొమ్మిడి రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# అపోలో ఆసుపత్రిలో గుండె బాధితున్ని పరామర్శించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



ప్రజాస్ఫూర్తి, వనపర్తి జిల్లా : హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో గుండె సంబంధిత శాస్త్ర చికిత్స చేయించుకున్న వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం ముందరితండా గ్రామానికి చెందిన వెంకటేష్ ను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి శనివారం పరామర్శించారు. యువకుడైన వెంకటేష్ గుండె సంబంధిత వ్యాధితో మొదటి నుంచే ఇబ్బందులు ఎదుర్కొంటుండేవారని, ఇటీవల అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యారన్నారు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాదులో ఉన్న అపోలో ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స నిర్వహించి స్టంట్ ఏర్పాటు చేశారు.ఈ క్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అపోలో ఆసుపత్రిలో గుండె బాధితుడు వెంకటేష్ ను పరామర్శించారు. ఏమైనా ఇబ్బంది ఉంటే ఏ సమయంలో అయినా తను అందుబాటులో ఉంటానని, ఎలాంటి సహాయ సహకారాలు అయినా అందిస్తానని ఎమ్మెల్యే మేఘారెడ్డి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

# బూత్ ఏజెంట్ల నియామకం వేగవంతం చేయాలి

**: సీఈఓ సుదర్శన్ రెడ్డి**





ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో సహకరించాలని కోరారు.మండలాల వారీగా ఇప్పటికే ఏఈఆర్ఓలు, బూత్ లెవెల్ అధికారులతో సమావేశాలు జరిగినట్లు తెలిపారు. ఇంకా సమావేశాలు జరగని ప్రాంతాల్లో వెంటనే నిర్వహించాలని ఆదేశించారు. యాప్‌పై పూర్తి అవగాహనతో పనిచేస్తూ ఓటరు వివరాల మ్యాపింగ్‌లో తప్పిదాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ పురోగతి 61.25 శాతానికి చేరుకుందని తెలిపారు. మిగిలిన పనులను గడువులోపు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామని చెప్పారు. రాజకీయ పార్టీలతో సమన్వయం పెంచి బూత్ ఏజెంట్ల నియామకాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఐడీ విచారణకు హాజరైన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సీఐడీ విచారణకు హాజరయ్యారు. ఈ ఏడాది జనవరి 29న హుజూరాబాద్‌లో సమ్మక్క జాతర వేళ గొడవ చోటుచేసుకుంది. పోలీసుల విధుల్లో అడ్డంకి, దూషణలు, మతవిద్వేష వ్యాఖ్యలు చేసినట్లు కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు అయింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది. కౌశిక్‌రెడ్డితో పాటు ఆయన భార్య శాలినిరెడ్డి హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయానికి వచ్చారు.



# ఆళ్లపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఆళ్లపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం విస్తృతంగా పర్యటించి పలు శాఖల పనితీరును సమీక్షించారు. “ప్రజా సమస్యలకు వెంటనే స్పందించాలి” అని అధికారులను ఆదేశించారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు.అనంతోగులో ఇందిరమ్మ ఇళ్ల పనులు పరిశీలించి, గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. కేజీబీవీలో ప్రత్యేక తరగతులు, భోజన నాణ్యతపై తనిఖీ చేసి సూచనలు ఇచ్చారు.ఆయిల్ పామ్ సాగుపై రైతులకు మార్గనిర్దేశం చేశారు. పీహెచ్‌సీలో వైద్య సేవలు, మందుల నిల్వలను పరిశీలించారు.తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సేవలపై సమీక్ష నిర్వహించి ఆలస్యం సహించబోమన్నారు. త్రాగునీరు, పారిశుధ్యం పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మధ్యాహ్న భోజన పథకంలో లోపాలపై ఆగ్రహం వ్యక్తం చేసి ఎంఈఓపై హెచ్చరిక జారీ చేశారు.ఈ పర్యటనలో తహసీల్దార్ జె. ప్రసాద్, ఎంపీడీఓ శ్రీను, లాల్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

# లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ప్రజాస్ఫూర్తి, శ్రీరంగాపురం ( వనపర్తి జిల్లా) : మండల పరిధిలోని నాగరాల గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆ గ్రామ సర్పంచ్ గుంటి మహదేవ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆర్.నరేందర్ రెడ్డి చేతుల మీదుగా శనివారం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుంటి మహదేవ్ మాట్లాడుతూ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి సహకారంతో వనపర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, రాష్ట్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారు భయపడవద్దని ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందిస్తామని వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సి. కురుమయ్య, వార్డ్ మెంబర్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధం

*** పరీక్షన్ రాజ్ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సూర్యాపేట జిల్లా ఇన్చార్జ్**





ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట : తరతరాలుగా వివక్షకు గురై సామాజిక, రాజకీయం, ఆర్థికం, వ్యవసాయము, పరిశ్రమల పరంగా వెనకబడి ఉన్నటువంటి దళితులు ఆత్మగౌరవం కోసం భారతదేశంలో క్రైస్తవం మతంలో ఉంటే వారికి రావలసిన రాజ్యాంగపరమైన హక్కులు కాలరాస్తాం అని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం తగదని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సూర్యాపేట జిల్లా ఇంచార్జ్ పరీక్షణ్ రాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.భారత రాజ్యాంగం ఆర్టికల్ 25,26 కల్పించినటువంటి మత స్వేచ్చను అడ్డుకోవడమే అని తెలియజేశారు. దళితులు కాకుండా ఇతర కులాల వారు ఏ మతానికి వెళ్లిన వారికి హక్కులు ఉంటాయి కానీ ఒక దళితులకు మాత్రమే హక్కు లేదు అనడం ఇది పూర్తిగా దళితులపై జరుగుతున్న వివక్ష అని తెలిపారు 1950 ప్రెసిడెంటల్ ఆర్డర్ భారత రాజ్యాంగానికి విరుద్ధమైన ఆర్డర్ అని,వీటిని వెంటనే రాష్ట్రపతి రద్దు చేయాలని అన్నారు. దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని లేకుంటే రానున్న రోజుల్లో ఆమ్ ఆద్మీ పార్టీ దళిత క్రైస్తవుల పక్షాన పోరాడుతుందని ఆయన తెలియజేశారు.

# బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ గా మాధగోని యాదయ్య



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : బాలల హక్కుల పరిరక్షణ వేదిక నల్లగొండ ఉమ్మడి జిల్లా నూతన కమిటీని ఉమ్మడి సమన్వయకర్త ఎర్ర శివరాజు రాష్ట్ర కో కన్వీనర్ పొదిల శ్రీనివాస్ సమక్షంలో జరిగిన ఒక సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నూతన కమిటి కన్వనర్ గా మాధగోని యాదయ్య, జిల్లా కార్యదర్శిగా జిల్లా శాంసన్, జిల్లా కో.కన్వనర్స్ గా మెరుగు పెద్దయ్య, కందుల మోహన్, విజయలక్ష్మి, జటవత్ రవి, గోపనబోయిన క్రిష్ణ, ఇర్గి నారాయణ, చింత స్వప్న, సహాయ కార్యదర్శి పొతేం కర్ణకర్, కోశాధికారి కొండ పూర్ణిమ, సలహాదారులుగా పగడాల నాగయ్య, కొండల్ రెడ్డి, కె జానయ్య,లను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా కన్వీనర్, కార్యదర్శి మాట్లాడుతూ సమాన విద్యా, న్యాయం రావాలంటే తెలంగాణ విద్యా కమిషన్ ఇచ్చిన సిఫారసులను వచ్చే విద్యా సంవత్సరం నుండే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

# స్వయం ఉపాధి పథకాలకై ఆన్ లైన్ దరఖాస్తు పొడిగింపు

* **ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కె. శ్రీనివాసరావు..**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లి., మహబూబాబాద్ జిల్లా ద్వారా 202526 సం. నకు స్వయం ఉపాధి పథకాలకై ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేయుటకు గడువు తేది: 08042026 వరకు పొడిగించనైనదని ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కె. శ్రీనివాసరావు నేడు ఒక ప్రకటన లో తెలిపారు. కావున అర్హులైన షెడ్యూల్డ్ కులములకు చెందిన యువతీ/యువకులు స్వయం ఉపాధి పథకాలకు కుటుంబ వార్షిక ఆదాయం (గ్రామీణ వాసులు రూ. 1,50,000, పట్టణ వాసులకు రూ. 2,00,000 లకు లోబడిన మరియు నాన్ అగ్రికల్చర్ సెక్టార్ పథకాలకు 2150 సం.ల మద్య వారు అర్హులని, అగ్రికల్చర్ సెక్టార్ పథకాలకు 2160 సం.ల మద్య వారు అర్హులని, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ పథకంలో భాగంగా స్వయం ఉపాది 1845 సం.ల మద్య వారు అర్హులు మరియు దినసరి వేతనం పొందే వారికీ వయస్సు 1835 సం,, ఉండవలెనని అన్నారు. గత 5 సం. లలో ఎస్సీ కార్పొరేషన్ నుండి లబ్ది పొందిన కుటుంబాల వారు అనర్హులని అన్నారు. ఇట్టి యాక్షన్ ప్లాన్ 202526 లో భాగంగా వివిధ రకాల యూనిట్స్ మంజూరు చేయబడునని, 1) ఎలక్ట్రిక్ టూ వీలర్ యూనిట్ విలువ రూ.1.00 లక్ష, 90 % సబ్సిడీ, 10 % బ్యాంకు ఋణం, 2) ఎలక్ట్రిక్ (త్రీ వీలర్ యూనిట్ విలువ రూ.3.00 లక్షలు, 70 % సబ్సిడీ, 30 % బ్యాంకు ఋణం, 3) సోలార్ పంప్ సెట్ యూనిట్ విలువ 3.00 నుండి రూ.7.00 లక్షలు, 100 % సబ్సిడీతో 4) పాడి పశువులు (02) లకు గాను యూనిట్ విలువ 2.40 లక్షలు, 70 % సబ్సిడీ, 30 % బ్యాంకు ఋణం తో కలవు. ఇట్టి యూనిట్లకు ధరఖాస్తు చేసుకోడానికి కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, ఆదార్ కార్డు, రేషన్ కార్డు, పాస్ పోర్ట్ సైజు పోటో, పట్టాదారు పాసు పుస్తకం (వ్యవసాయ సంబందిత యూనిట్లకు), డ్రైవింగ్ లైసెన్సు (రవాణా రంగం యూనిట్లకు) మరియు పాడి పశువులు యూనిట్ కొరకు (0.10 గుంటల సాగు భూమి తప్పనిసరి) తదితర ధృవ పత్రాలతో 0804 2026 వరకు ఆన్ లైన్ (www.tgobmms.cgg.gov.in) నందు దరఖాస్తు చేసుకొని, వెంటనే సదరు దరఖాస్తును సంబందిత ధృవ పత్రాలతో (హార్డ్ కాపీ) గ్రామీణ ప్రాంతం వారు సంబందిత ఎంపీడీవో కార్యాలయము నందు మరియు పట్టణ ప్రాంతం వారు సంబందిత మునిసిపాలిటి కార్యాలయము నందు సమర్పించవలసినదిగా తెలియపరచనైనది. ఈ అవకాశాన్ని అర్హులైన ఎస్సి నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోగలరని ఈ సందర్భంగా అధికారి కోరారు.

# నకిలీ (బ్యాండ్) పత్తి విత్తనాల పట్టివేత

* **ఇద్దరు అరెస్టు, పరారీలో ఒకరు**



మేడ్చల్, ప్రజాస్ఫూర్తి : నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను మేడ్చల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ సంఘటన మెడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ సమీపంలో జరిగింది. విశ్వసనీయ సమాచారం మేరకు మెడ్చల్ పోలీసులు, ఎస్ఓటీ కుత్బుల్లాపూర్ బృందంతో కలిసి సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా ఏపీ 39 వీఈ 4038 నంబర్ గల మహీంద్రా బొలెరో వాహనంలో నిషేధిత బీజీIII పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు బొలెరో వాహనాన్ని అడ్డగించారు.తనిఖీ చేపట్టగా వాహనంలో 3000 కిలోల నిషేధిత బీజీIII పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తున్నట్లు బయటపడింది. ప్రధాన సరఫరాదారుడు మగులూరి సాంబ శివరావు కర్నూలు నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు ఈ విత్తనాలను తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూలు జిల్లా, కొసిగి మండలానికి చెందిన చెవుల నర్సిములు (వాహన యజమానితో వాహనాన్ని రూ.30,000కు అద్దెకు తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. పోలీసుల తనిఖీలను తప్పించుకునేందుకు పత్తి విత్తన సంచులను క్యాబేజీ సంచుల కింద దాచిపెట్టారు.కర్నూలు నుంచి నర్సింహులు, అదే ప్రాంతానికి చెందిన డ్రైవర్ రమేష్‌తో కలిసి నాగ్‌పూర్‌కు బయలుదేరినట్లు పోలీసులు తెలిపారు. నాగ్‌పూర్ చేరుకున్న తర్వాత సరఫరాదారు రిసీవర్ వివరాలు తెలియజేయాల్సి ఉందని సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని తలారి రమేష్, నర్సింహులను అరెస్టు చేసి వారి నుంచి 3000 కిలోల నిషేధిత బీజీIII పత్తి విత్తనాలు (విలువ రూ.90 లక్షలు), ఒక బొలెరో వాహనం (విలువ రూ.8 లక్షలు) స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.98 లక్షల విలువ గల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సరఫరాదారు మగులూరి సాంబ శివరావు పరారీలో ఉన్నాడు.అయితే గతంలో మగులూరి సాంబ శివరావు, చెవుల నర్సిములు సూర్యాపేట జిల్లా ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఇదే తరహా కేసులో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.అరెస్టు చేసిన నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను కోర్టులో హాజరుపరిచి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

**పోలీసుల సూచన:**

రాష్ట్రంలో నకిలీ విత్తనాల అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి నకిలీ విత్తనాలపై ఎలాంటి సమాచారం ఉన్నా సమీప పోలీసులకు తెలియజేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు

# పోటీలతో ప్రతిభకు మెరుగు



**– జిల్లా క్రీడల అధికారి పరంధామిరెడ్డి**

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:జిల్లాలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం ద్వారా ప్రతిభావంతమైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని జిల్లా క్రీడల అధికారి ఎం. పరంధామిరెడ్డి తెలిపారు. రామవరం సాధన గ్రౌండ్లో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్ అథ్లెటిక్స్ ఎంపికలను ఆయన శనివారం ప్రారంభించారు. ఒలింపిక్ జెండా ఊపి పరుగు పందెంలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నైపుణ్యం కలిగిన అథ్లెట్లు అధికంగా ఉన్నారని, వారికి సరైన శిక్షణ, అవకాశాలు కల్పిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో తనవంతు కృషి కొనసాగుతుందని తెలిపారు. గత రెండేళ్లుగా జిల్లా అథ్లెట్లు సీఎం కప్‌లో విజయం సాధించడం గర్వకారణమన్నారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవ సభకు అధ్యక్షత వహించిన 17వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రవెల్లి శంకర్ సాధన గ్రౌండ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, ఎమ్మెల్యే సహకారంతో గ్యాలరీ నిర్మాణం చేపడతామని చెప్పారు. 14వ డివిజన్ కార్పొరేటర్ కూరపాటి సుధాకర్ రాజు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని, మహిళా క్రీడాకారుల ఉత్సాహం అభినందనీయం అన్నారు. 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ, 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మలు మాట్లాడుతూ ఎండలను లెక్కచేయకుండా మహిళా క్రీడాకారులు అధికంగా పాల్గొనడం సంతోషకరమని, ఇదే స్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ నెల 11న హనుమకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి 20 మందిని ఎంపిక చేస్తామని అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్ తెలిపారు. జిల్లా జాయింట్ సెక్రెటరీ డి. మల్లికార్జున్, కోచ్ రియాజ్ పాషా ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. కోచ్‌లు జొన్నగిరి ప్రసాద్, పవన్, పిడి శ్వేతా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామవరం వర్తక సంఘం సభ్యులు జాకీర్, సుభాష్, ముస్తఫా క్రీడాకారులకు అల్పాహారం అందజేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రులు బలోపేతం – కలెక్టర్ అంకిత్ ఆదేశాలు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆసుపత్రుల పనితీరు, అభివృద్ధి పనులు, ఆరోగ్యశ్రీ సేవలపై సమగ్రంగా చర్చించారు.ఆరోగ్యశ్రీ సేవల అమలు, నిర్మాణాలు, మరమ్మత్తుల పురోగతిపై వివరాలు తెలుసుకున్న కలెక్టర్, పనులను గడువులోపు పూర్తి చేయాలని సూచించారు.సిబ్బంది కొరత, వైద్యుల లభ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సమయపాలనతో సేవలు అందించాలని ఆదేశించారు.భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో మరుగుదొడ్ల మరమ్మత్తులను తక్షణమే పూర్తి చేయాలని సూచిస్తూ, మౌలిక సదుపాయాల మెరుగుదలపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, శానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పేదలు ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడకుండా ప్రభుత్వ వైద్యంపై విశ్వాసం పెంచాలని సూచించారు. ప్రసవ సేవలు, బ్లడ్ బ్యాంకుల పనితీరు, రక్త నిల్వలపై కూడా సమీక్షించారు.ప్రైవేటు స్కానింగ్ సెంటర్లపై పర్యవేక్షణ పెంచాలని, జిల్లాలో సికిల్ సెల్ అనీమియా కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీహెచ్ఓ రవిబాబు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలపై హైకోర్టు తీర్పు సరికాదు

* **ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఫీజు బకాయిలపై ఇచ్చిన తీర్పు సరైనది కాదని ఇది విద్యార్థుల చదువులకు గొడ్డలిపెట్టు వంటిదని, హైకోర్టు తీర్పును పునఃసమీక్ష చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. శనివారం లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలు ప్రభుత్వం ప్రకటించిన ఫీజు పథకం అమలు చేస్తామని అంగీకారాన్ని తెలిపి విద్యార్థులను చేర్చుకున్నారని, అలాంటిది ప్రైవేటు యాజమాన్యాల బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వకుండా విద్యార్థుల నుండి వసూళు చేసుకోవాలని తీర్పు చెప్పడం సరైనది కాదని అభిప్రాయపడ్డారు. అణగారిన వర్గాల నుండి ఇప్పుడే ఉన్నత విద్యలోకి వస్తున్న పేద విద్యార్థులు ఈ తీర్పు వల్ల మరింత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రైవేటు యాజమాన్యాలు ఫీజులు బకాయిలు రావడం లేదని పేద విద్యార్థుల సర్టిఫికేట్స్ ఇవ్వకుండా వేధింపులు గురి చేస్తున్నారని, దీని వల్ల గతంలో విద్యార్థులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని తెలిపారు. హైకోర్టు తీర్పును పునఃసమీక్ష చేయాలని, ప్రభుత్వానికి తక్షణమే ఫీజుల విడుదల కోసం ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్, కీర్తన, సంజన, మానస, స్వప్న, స్పందన, కవిత, సోని, ఉదయ్, రాజేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో ఎక్కడా లేని విధంగా పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు

* **పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్,**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ పట్టణంలోని బాలాజీ గార్డెన్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసి, సన్నబియ్యం లబ్ధిదారులతో కలిసి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ భోజనం చేశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పేద ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ లోని ఇందిరమ్మ ప్రభుత్వం అని, గిరిజన జిల్లా అయిన మహబూబాబాద్ లో గడ్డి మందు ద్వారా క్షణిక ఆవేశంతో అనేకమంది యువత ప్రజలు చనిపోయారని అట్టి మందును బ్యాన్ చేసినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ రైతు సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతి, గ్రామాలు పట్టణాల అభివృద్ధికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గంలోని (92) మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ప్రజలకు మంజూరు అయిన చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని, సన్న బియ్యం పథకం ద్వారా ఏప్రిల్, మే, జూన్, మూడు నెలలకు సంబంధించి జిల్లాలోని (558) రేషన్ షాపుల ద్వారా, 2,77,973, మంది కార్డుదారులకు, 15, 734,361 మెట్రిక్ టన్నులు ఏప్రిల్ నెలలో ఒకటేసారి 8,22,548 మంది లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, నియోజకవర్గం లోని 190 రేషన్ దుకాణాల ద్వారా, 1,02,867, కార్డుదారులకు, 3,07,846 లబ్ధిదారులకు, 23,531,1.1100 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేశారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ, పట్టణ స్థాయిలలో గ్రామసభలు నిర్వహించి షెడ్యూలు ప్రకారం రైతుల సంక్షేమం పేద ప్రజల కు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, సన్న రకాలకు బోనస్, చేయూత పెన్షన్లు, గృహ జ్యోతి 2 యూనిట్ల ఉచిత విద్యుత్ పంపిణీ, కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్, కొత్త రేషన్ కార్డులు మంజూరు తదితర అనేక పథకాలు, ప్రవేశపెట్టి నిధులు కేటాయిస్తూ క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులందరికీ అందించడం జరుగుతుందన్నారు. పట్టణంలోని వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వేగవంతమైన వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గడ్డి మందు నివారణకు మహబూబాబాద్ శాసనసభ్యులు చర్యలు తీసుకోవడం ఆ మందును ప్రభుత్వం బ్యాన్ చేయడం ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలు జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరికి అందించి వారి అభ్యున్నతికి కృషి చేయడం కోసం జిల్లా యంత్రాంగం ఎప్పుడు ముందుంటుందని, సన్న బియ్యం లబ్ధిదారులతో కలిసి భోజనం చేయడం సంతోషంగా ఉందని ఆమె అన్నారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి, మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, సంబంధిత సర్పంచులు, లబ్ధిదారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హిందూ మహా సమ్మేళనం ఆహ్వాన కరపత్రం ఆవిష్కరణ



నిజాంపేట్, ప్రజాస్ఫూర్తి : ప్రగతినగర్ బతుకమ్మ ఘాట్ లో ఈ నెల 12న ఆదివారం జరిగే 'హిందూ మహా సమ్మేళనం' ఆహ్వాన కరపత్రాన్ని పట్టాభి రామాలయంలో ఆవిష్కరించారు. ముందుగా శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సమ్మేళన సమితి ప్రతినిధులు కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం, కార్యక్రమానికి వక్తగా విచ్చేస్తున్న మౌనిక సుంకర ను నివాసంలో కలిసి ఆహ్వాన పత్రం అందించారు. ఈ కార్యక్రమాలలో 'అయోధ్య రామ హిందూ సమ్మేళన సమితి' అధ్యక్షులు పొన్నాల శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి గరికపాటి సాంబశివరావు, ఉపాధ్యక్షులు మోక్షశ్రీ, సహ కోశాధికారి కంకర చంద్రసేనా రెడ్డి, డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు, సాంస్కృతిక సంయోజకులు శ్రీరంగం కృష్ణమాచార్యులు, సత్య కాటేపల్లి, వెంకట రెడ్డి, జ్యోత్స్న, శిల్ప లత తదితరులు పాల్గొన్నారు.

# డొనాల్డ్ ట్రంప్ చెప్పినట్లే కేంద్రం పాలన: మహేశ్‌కుమార్ గౌడ్



ఆదిలాబాద్ అర్బన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పినట్లు కేంద్ర ప్రభుత్వం నడుస్తోందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ ధ్వజమెత్తారు. శనివారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాకేంద్రాలకు వచ్చిన ఆయన డీసీసీ కార్యవర్గ సమావేశాల్లో మాట్లాడారు. భాజపా, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ సంస్థలు దేవుడి మీద ప్రమాణం చేస్తూ ఆ దేవుడినే మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికలు వచ్చినపుడు శ్రీరాముడు, ఆంజనేయుడు గుర్తుకు వస్తారా?అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా.. దేశానికి తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. ఇంధన ధరలను పెంచి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. భాజపా మతం పేరుతో ఓట్లు అడిగితే కాంగ్రెస్ పార్టీ విద్య, వైద్యం, వ్యవసాయం, అభివృద్ధి పేరుతో ఓట్లు అడుగుతుందన్నారు. మరోవైపు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన భారాస పనైపోయిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్లు దోచుకుని కేసీఆర్ ఫామ్ హౌజ్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. కేటీఆర్, హరీశ్‌రావు కుర్చీ కోసం కొట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 101 సీట్లు సాధిస్తుందని జోస్యం చెప్పారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో గెలిచి రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి స్వాధీనం




సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. రూ.50 లక్షల విలువైన గంజాయితోపాటు, రూ.72,500 నగదును రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయానికి యత్నించిన నలుగురిని అరెస్టు చేశారు. తుని నుంచి రైలులో హైదరాబాద్, ముంబయికి గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.

# గజ్వేల్ ఘటన.. రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే: హరీశ



గజ్వేల్: గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి డీసీసీ అధ్యక్షురాలు, కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీగా వెళ్లారు. ఆఫీసులో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టి, కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ ఘటనను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే జరిగిందన్నారు. ప్రజాస్వామ్యంపై సీఎం చేయించిన దాడిగా పేర్కొన్నారు. ఈ దాడిని పోలీసులు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. క్యాంపు ఆఫీసుపై దాడులు చేస్తుంటే శాంతిభద్రతలు ఉన్నట్లా.. లేనట్లా? అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలపై దాడులు జరగడం సిగ్గుచేటని మండిపడ్డారు.

# నేడు హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

హైదరాబాద్, శంషాబాద్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో ఆదివారం రాష్ట్ర హైకోర్టు జోన్ 2 భవన నిర్మాణానికి శంకుస్థాపన నిమిత్తం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శనివారం హైదరాబాద్‌కు విచ్చేశారు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్‌తోపాటు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పి.శ్యాంకోశీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం సీజేఐ గౌరవార్థం శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్





అపరేశ్‌కుమార్ సింగ్, ఇతర న్యాయమూర్తులు, అధికారులు హాజరయ్యారు. అత్యాధునిక వసతులతో బుద్వేలులో నిర్మిస్తున్న హైకోర్టు నూతన భవనం పనులు కొనసాగుతుండగా... రెండోదశలో భాగంగా న్యాయమూర్తుల క్వార్టర్ల నిర్మాణానికి సీజేఐ సూర్యకాంత్ ఆదివారం ఉదయం 10.30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎంతోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎస్.వి.భట్టి, జస్టిస్ ఆలోక్ అరాధే, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొననున్నారు.

## రాజన్న, మల్లన్న..
# గ్యాస్‌కు లోటులేదన్నా



హైదరాబాద్ / వేములవాడ / శ్రీశైలం, ఏప్రిల్ 4: వేములవాడ రాజన్న ఆలయం, శ్రీశైలం మల్లన్న క్షేత్రాల అధికారులు గతంలో తీసుకున్న ఓ నిర్ణయం ప్రస్తుత గ్యాస్ కొరత సమయంలో కలిసివస్తోంది. పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావంతో అనేకచోట్ల గ్యాస్ కొరత తీవ్రంగా ఉన్నా.. ఈ క్షేత్రాల్లో భక్తులకు అన్నదానం ఎలాంటి లోటులేకుండా కొనసాగుతోంది. ఇందుకు కారణం వీటికి గ్యాస్ డీలర్‌షిప్ ఉండడమే. వేములవాడ రాజన్న ఆలయంలో ఆది, సోమవారాల్లో కనీసం వెయ్యి, మిగతా రోజుల్లో 500600 మంది భక్తులకు అన్నదానం చేస్తుంటారు. శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి దేవస్థానంలో శని, ఆది, సోమవారాల్లో నిత్యం 10 వేలమంది, ఇతర రోజుల్లో దాదాపు 6 వేలమందికి అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. రెండు ఆలయాలకు సొంతంగా గ్యాస్ డీలర్‌షిప్ ఉండటంతో అన్నదానం, అటు ప్రసాదాల తయారీకి గ్యాస్ సమస్య లేదు. ఉమ్మడి ఏపీగా ఉన్న సమయంలో ప్రధాన ఆలయాలకు గ్యాస్ డీలర్‌షిప్‌లు ఇచ్చేందుకు ఆయిల్ కంపెనీలు ముందుకొచ్చాయి. అప్పట్లో ఈ రెండు క్షేత్రాలు వినియోగించుకున్నాయి.

## 9న సోమశిలలో
# హెలిప్యాడ్ ప్రారంభం

* **అందుబాటులోకి రానున్న హెలిటూరిజం**
* **మంత్రి జూపల్లి కృష్ణారావు**



కొల్లాపూర్ : పర్యాటకులు, భక్తుల కోసం హెలిటూరిజంను అందుబాటులోకి తెస్తామని... ప్రైవేట్ సంస్థతో కలిసి ఆకాశమార్గాన నల్లమల, కృష్ణాతీర అందాలను తిలకిస్తూ, పుణ్యక్షేత్రాలు సందర్శించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. ఇందుకోసం ఈనెల 9న సోమశిలలో హెలిప్యాడ్‌ను ప్రారంభిస్తామన్నారు. శనివారం సాయంత్రం సోమశిలలో స్థల పరిశీలనకు వచ్చిన ఆయన మాట్లాడుతూ హెలిప్యాడ్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం ఎంత ఉందో సేకరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సోమశిలను సందర్శించి, శ్రీశైలానికి, అక్కడి నుంచి హైదరాబాద్ వరకు హెలికాప్టర్ సేవలను పర్యాటక శాఖ ప్రారంభించనుందన్నారు. దీనికోసం సోమశిలలో హెలిప్యాడ్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించామని, త్వరగా పనులు పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించామన్నారు. తర్వాత ప్రైవేటు ఏజెన్సీకి అప్పగిస్తామని, ధరల నిర్ణయ బాధ్యత వారిదేనన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్, డీఈ రమాదేవి, తహసీల్దార్ భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శాటిలైట్ మ్యాపింగ్‌తో పంట విస్తీర్ణాల అంచనా: తుమ్మల



హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే సీజన్ నుంచి ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానం, చిత్రాల (ఇమేజింగ్) ఆధారంగా పంటల సమగ్ర ప్రణాళికను అమలు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జిల్లా, మండలాలు, గ్రామాల వారీగా పంట విస్తీర్ణాలను అంచనా వేయడంతో పాటు వాటి మార్కెటింగ్, డిమాండ్, ఉత్పత్తి, సరఫరా, గిడ్డంగి సదుపాయాలపై కచ్చితమైన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. శనివారం సచివాలయంలో ఉపగ్రహ ఆధారిత పంటల మ్యాపింగ్‌పై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, అగ్రివర్సిటీ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ..'శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు ఖర్చులను తగ్గించడంతోపాటు దిగుబడులను పెంచే అవకాశాలున్నాయి. భూసార స్థితి, నీటి లభ్యత, పంటల ఆరోగ్యాన్ని ముందుగానే అంచనా వేయొచ్చు. రైతులు ఏ పంటను ఎక్కడ, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారనే కచ్చితమైన సమాచారంతో వారికి మెరుగైన ధరలు అందేలా చూస్తాం. రెవెన్యూ, అటవీశాఖల అధికారులతో రాష్ట్రస్థాయి సమన్వయ సమావేశం నిర్వహిస్తాం. అటవీశాఖ భూముల్లో సాగులో ఉన్న యూకలిప్టస్, సుబాబుల్ ఇతర పంటల వివరాలు తెలుసుకుంటాం. సర్వే నంబర్ల వారీగా పంటల విస్తీర్ణం మదింపులో ఎదురవుతున్న ఇబ్బందుల పరిష్కారం దిశగా కృషి చేయాలి' అని అధికారులను ఆదేశించారు.

## గజ్వేల్‌లో ఉద్రిక్తత...

* **కేసీఆర్ క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టిన కాంగ్రెస్ నేతలు**
* **ఆ పార్టీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయంటూ ఠాణాలో ఫిర్యాదు చేసిన భారాస నాయకులు**

గజ్వేల్: గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే కేసీఆర్ క్యాంపు కార్యాలయాన్ని శనివారం కాంగ్రెస్ శ్రేణులు ముట్టడించాయి. సమావేశ మందిరంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని పెట్టాయి. ఈ పరిణామాలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉదయం 11 గంటల సమయంలో మొట్రాజుపల్లి కూడలి నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నారు. గమనించిన క్యాంపు కార్యాలయ సిబ్బంది గేటుకు తాళం వేశారు. పలువురు కార్యకర్తలు గేటుపైకి ఎక్కి లోపలికి ప్రవేశించారు. కార్యకర్తలు వాగ్వాదానికి దిగగా సిబ్బంది గేటు తీయడంతో ఆంక్షారెడ్డి కార్యకర్తలతో కలిసి లోనికి వెళ్లి గోడకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని పెట్టారు. ఒక్కసారిగా కార్యకర్తలు లోనికి రావడంతో ప్రధాన ద్వారం వైపు అద్దాలు పగిలిపోయాయి. ఇదంతా జరిగిన కొంత సేపటికి ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, భారాస కార్యకర్తలు క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. సీఎం ఫొటోను అక్కడ నుంచి తీసివేశారు. పోలీసులు వారించినా ఫలితంలేకపోయింది. ఏసీపీ నర్సింలు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్యాంపు కార్యాలయంపై దాడి చేశాయంటూ భారాస నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు ఉద్రిక్తత కొనసాగింది.

# సీఐడీ విచారణకు సతీమణితో కౌశిక్‌రెడ్డి హాజరు



హైదరాబాద్: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆయన సతీమణి శాలినిరెడ్డితో కలిసి శనివారం సీఐడీ విచారణకు హాజరయ్యారు. సీఐడీ ఆర్థిక నేరాల విభాగం డీఎస్పీ రంగస్వామి నేతృత్వంలోని బృందం వారిని వేర్వేరుగా విచారించింది. దాదాపు 3 గంటలపాటు కౌశిక్‌రెడ్డిని అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. హుజూరాబాద్ కేసీ క్యాంపు చౌరస్తాలో జనవరి 29న తన అనుచరులతో కలిసి ధర్నా చేసిన క్రమంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలంను ఉద్దేశించి ఎందుకు వ్యాఖ్యలు చేశారని ప్రశ్నించగా.. తాను తప్పుగా మాట్లాడలేదని చెప్పినట్లు సమాచారం. కౌశిక్‌రెడ్డితోపాటు రహదారిపై ధర్నాలో కూర్చుని ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం కలిగించడంపై శాలినిరెడ్డిని దర్యాప్తు బృందం విచారించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంకలో సమ్మక్క సారలమ్మ జాతరను పాడి ఉదయ్‌రెడ్డి నిర్వహిస్తున్న క్రమంలో జనవరి 29న కౌశిక్‌రెడ్డి అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించగా గొడవ జరుగుతుందనే ఉద్దేశంతో పోలీసులు అభ్యంతరం చెప్పారు. అయినా కార్లలో వెళ్లేందుకు యత్నించగా అడ్డుకున్నారు. దీంతో కౌశిక్‌రెడ్డి తన అనుచరులతో కలిసి రోడ్డుపై ధర్నాకు దిగారు. పోలీసులు ఆయనను అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నించగా వారి మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో కౌశిక్‌రెడ్డి మతపరమైన వ్యాఖ్యలతోపాటు కరీంనగర్ సీపీని దూషించారనే ఆరోపణలపై తొలుత హుజూరాబాద్ పోలీసులు కేసు నమోదు చేయగా..అనంతరం సీఐడీకి బదిలీ చేశారు. తాజాగా కౌశిక్‌రెడ్డిని విచారించిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై సీఐడీ దృష్టి సారించింది. ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీ, సెల్‌ఫోన్ వీడియోలను విశ్లేషణ నిమిత్తం ఎఫ్ఎస్ఎల్‌కు పంపించనుంది.

* **దీక్షను అడ్డుకునేందుకే పిలిచారు: కౌశిక్‌రెడ్డి**

'సీఐడీ అధికారులు ఏం అడిగారో వారికే స్పష్టత లేదు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మతమార్పిడికి పాల్పడుతున్నారని నేనెక్కడైనా అన్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా. కరీంనగర్ జిల్లా చెత్తనంతా తీసుకొచ్చి హుజూరాబాద్‌లో వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంపై నేను దీక్ష చేపడుతున్నట్లు తెలిసే విచారణకు పిలిచారు. అయినా ఈనెల 7న హుజూరాబాద్‌లో దీక్ష చేస్తా' అని విచారణ అనంతరం కౌశిక్‌రెడ్డి తెలిపారు.

# ఆరు గ్యారంటీలు అమలైనట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

* **లేదంటే సీఎం దిగిపోవాలి: కేంద్ర మంత్రి బండి సంజయ్**



హుజూరాబాద్: రాష్ట్రంలోని ఏ గ్రామంలోనైనా ఆరు గ్యారంటీలు అమలు చేసినట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని, అమలు కాలేదని తాను నిరూపిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదవి నుంచి దిగిపోతారా? అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిర్సపల్లి శివారులో ప్రతిపాదిత డంపింగ్ యార్డు స్థలాన్ని శనివారం ఆయన స్థానిక భాజపా నాయకులు, గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రికి దమ్ముంటే తన సవాల్‌ను స్వీకరించాలన్నారు. గతంలో బిహార్, దిల్లీ, మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలకు రేవంత్‌రెడ్డి స్టార్ క్యాంపెయినర్‌గా వెళ్లారని, తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నామని చెప్పడంతో అక్కడి ప్రజలు వాస్తవాలు తెలుసుకొని కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టారన్నారు. ఇప్పుడు కేరళలోనూ అలాగే ప్రచారం చేస్తున్నారని, డబ్బు మూటలు పంచడానికే ముఖ్యమంత్రి అక్కడకు వెళ్లారని బండి సంజయ్ ఆరోపించారు. అక్కడి ప్రజలు, మీడియా తెలంగాణలో పర్యటిస్తే ఆరు గ్యారంటీల అమలుపై వాస్తవాలు తెలుస్తాయన్నారు. అబద్ధాలాడటంలో రేవంత్‌రెడ్డి దిట్ట అని... ఆయనకు ఆస్కార్ కంటే పెద్ద అవార్డు ఇవ్వాలని ఎద్దేవా చేశారు. డంపింగ్ యార్డు ఏర్పాటును అప్పటి భారాస ప్రభుత్వం ప్రతిపాదించగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తోందన్నారు. ప్రజలకు ఇబ్బందికరంగా మారిన డంపింగ్ యార్డు ఏర్పాటు ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే ఉద్యమిస్తామని బండి సంజయ్ పేర్కొన్నారు. కొద్ది రోజులుగా దీక్షలు చేస్తున్న స్థానికులకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఆయన వెంట భాజపా జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు సంపత్‌రావు, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ విజయ, పార్టీ నాయకులు ఉన్నారు.



# శ్రీశైలంలో తగ్గుతున్న నీటిమట్టం

* **మరింత పడిపోతే సాగుకు కష్టమే**
* **ఆరు జిల్లాల్లో తాగునీటికీ తిప్పలే**

మహబూబ్‌నగర్: శ్రీశైలం జలాశయంలో రోజురోజుకు నీటిమట్టం తగ్గుతోంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారంగా కల్వకుర్తి ఎత్తిపోతల (కేఎల్ఐ) నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీరు, ఆరు జిల్లాలకు తాగునీరు అందిస్తున్నారు. జలాశయంలో నీటి నిల్వలు తగ్గుముఖం పడుతుండటంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేఎల్ఐ ఎత్తిపోతలతో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, వనపర్తి నియోజకవర్గాలతో పాటు ఇతర ప్రాంతాల్లో 2.8 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. మొక్కజొన్న, వేరుసెనగ, మినుము, వరి తదితర పంటలకు 20 రోజుల నుంచి నెల వరకు సాగునీటిని అందించాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆఖరి తడుల కోసం కనీసం 6 టీఎంసీలు అవసరం. కాగా, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మిషన్ భగీరథ నీటిని తరలిస్తున్నారు. ఈ జిల్లాలకు నెలకు 0.8 టీఎంసీ అవసరం. ఏప్రిల్, మే, జూన్, జులై చివరి వరకు దాదాపు 3.2 టీఎంసీల నుంచి 4 టీఎంసీలు సరఫరా చేయాల్సి ఉంటుంది. సాగు, తాగునీటికి దాదాపు 10 టీఎంసీలు ఎత్తిపోయాలి.

* **వినియోగించుకునేవి 13 టీఎంసీలు..**

ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 43.2720 టీఎంసీల నిల్వ ఉంది. ఇందులో 30 టీఎంసీలు డెడ్ స్టోరేజీ. వినియోగానికి వీలున్నది కేవలం 13 టీఎంసీలే. ఇందులో మనకు 10 టీఎంసీలు కావాలి. కేఎల్ఐ నుంచి ప్రస్తుతం రోజుకు 2,400 క్యూసెక్కుల నీటిని మోటార్ల ద్వారా ఎత్తిపోస్తున్నారు. వినియోగంలో నిర్లక్ష్యం వహిస్తే సాగు, తాగునీటికి కష్టాలు తప్పవు. వేసవి దృష్ట్యా శ్రీశైలం ఎడమ జలవిద్యుత్తు కేంద్రం (తెలంగాణ) మార్చి 26న, కుడి జలవిద్యుత్తుకేంద్రం (ఆంధ్రప్రదేశ్) మార్చి 30న ఉత్పత్తిని నిలిపివేసింది. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు.

# ఆరోగ్య వారోత్సవాలపై ప్రజలకు అవగాహన కల్పించండి

* **మంత్రి దామోదర్ రాజనర్సింహ**



హైదరాబాద్: ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న 'హెల్త్ వీక్'లో ప్రజలకు ఆరోగ్యంపై విస్తృత అవగాహన కల్పించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు ఆదేశించారు. శనివారం ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో... హెల్త్ వీక్‌లో చేపట్టనున్న కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అన్ని విభాగాలు పాల్గొని ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా, కుటుంబ ఆరోగ్య సంక్షేమశాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ నరేంద్ర కుమార్, డీహెచ్ రవీంద్ర నాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈ నెల 6వ తేదీ నుంచి 11 వరకు చేపట్టనున్న వివిధ కార్యక్రమాలపై మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

# ఫుట్‌బాల్ ముగింపు వేడుకలకు రావాలని సీఎంకు ఆహ్వానం



హైదరాబాద్: హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న '74వ బి.ఎన్.మల్లిక్ మెమోరియల్ ఆల్‌ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2026' పోటీలు ఆదివారం ఫైనల్ మ్యాచ్‌తో ముగించనున్నారు. ఈ ముగింపు వేడుకలకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని డీజీపీ శివధర్‌రెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేశ్, ఐజీపీ (స్పోర్ట్స్) గజరావు భూపాల్ శనివారం కలిసి ఆహ్వానించారు. ఈ వేడుకల్లో విజేతతో పాటు రన్నరప్ జట్లకు సీఎం ట్రోఫీలను అందించనున్నారు. అనంతరం ఓవరాల్ కెప్టెన్ క్రీడల జెండాను సీఎం రేవంత్‌రెడ్డి.. ఐబీ స్పెషల్ డైరెక్టర్‌కు అప్పగించి తదుపరి క్రీడల వరకు భద్రపరచాలని కోరనున్నారు.

# తెలంగాణ పథకాలు.. కేరళలోనూ అమలుచేస్తాం



హైదరాబాద్: కేరళ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే తెలంగాణలో అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను.. ఈ రాష్ట్రంలోనూ అమలు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. మహిళల సాధికారత కోసం తెలంగాణలో అమలుచేస్తున్నట్లే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తామని ప్రకటించారు. శనివారం అలెప్పి నియోజకవర్గం మన్నన్‌చెరీ పంచాయతీలోని కవుంకల్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీతో కలిసి పొంగులేటి పర్యటించారు. స్థానిక అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడిన పొంగులేటి.. కేరళ ప్రజల్లో పరిపాలన మార్పు ఆకాంక్ష స్పష్టంగా కనిపించిందని పేర్కొన్నారు. 'ఈ దఫా కేరళలో రాజకీయ మార్పు అనివార్యం. ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. యూడీఎఫ్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యంతో అధికారంలోకి వస్తుంది. ప్రస్తుతం కేరళలో ఉన్న సీపీఎం ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనపెట్టి, భాజపాపై విమర్శలకే పరిమితమవుతూ రాజకీయ నాటకాలు ఆడుతోంది. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి ప్రధాన సమస్యలను పక్కనపెట్టి, రాజకీయ ఆరోపణలతో కాలక్షేపం చేస్తోంది. ప్రజలు ఇప్పటికే సీపీఎం ప్రభుత్వంపై విసుగుచెందారు. ఈ ఎన్నికల్లో యూడీఎఫ్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయం' అని ధీమా వ్యక్తంచేశారు.



ఒకప్పుడు చందమామను చూపిస్తూ.. గోరుముద్దలు తినిపించేది అమ్మ! పిల్లాడు ఆరోగ్యంగా పెరిగేవాడు. ఇప్పుడు.. సెల్‌ఫోన్ చేతికిచ్చి, ముద్దలు తినిపిస్తుంది. నాన్నేమో.. ట్యాబ్ చూపిస్తూ లాల పోస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదుగుతున్న చిన్నారులను.. పసితనంలోనే అనేక రుగ్మతలు చుట్టుముడుతున్నాయి. పెరుగుతున్న సాంకేతికత కొన్నిరకాల వ్యాధులకు కారణం అవుతున్నది. అందులో ఒకటి ఆటిజం. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వాడకం పెరిగేకొద్దీ ఆటిజం సమస్య హెచ్చుతున్నది.

# ఎండల్లో తప్పు చేయకండి!

ఎండాకాలం వచ్చిందంటే చర్మానికీ, శరీరానికీ అవసరాలు మారతాయి. దానికి తగ్గట్టు కొన్ని విషయాల్లో మనమూ మారతాం. అక్కడే తప్పు చేసే అవకాశం ఉంది. ఇవి అవసరాలు కాదు, అనర్థాలు అంటున్నారు చర్మ, ఆరోగ్య నిపుణులు.

### ఇంట్లో అక్కర్లేదు

సన్‌స్క్రీన్ బయటికెళ్లేప్పుడు మాత్రమే రాసుకోవాలి. ఇంట్లో ఉన్నా, కారులో వెళ్తున్నా అక్కర్లేదు అనుకోవడం అపోహ మాత్రమే. మనం ఎక్కడ ఉన్నా మన చుట్టూ ఉండే వెలుతురులో చర్మానికి హాని చేసే అతినీల లోహిత కిరణాలు ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఈ సమయంలో సన్‌స్క్రీన్ వాడాలి.

### కడుగుతూనే ఉండాలి

ఎండాకాలం వచ్చిందంటే అదేదో యాడ్‌లో 'కడుగు బాబు కడుగు' అన్నట్టు మొహాన్ని మాటిమాటికీ నీళ్లతో కడుగుతుంటారు. ఇది ఎండవేళ చర్మానికి హాయిని కలిగించి, తేమగా ఉంచుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఇలా మాటిమాటికీ నీటితో చర్మాన్ని కడగడం వల్ల 'ట్రాన్స్ ఎపిడెర్మల్ వాటర్ లాస్ (టీఈడబ్ల్యూఎల్)' అని పిలిచే ప్రత్యేక పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిబారుతుంది.

### అదైతే చాలు

వేసవిలో ఏ వీధి మూలన చూసినా మజ్జిగ, పుదీనా రసం కుండలు, జీరా నీళ్లు, నిమ్మరసాలు దొరుకుతుంటాయి. ఎండవేళ చలువ చేస్తాయన్న ఉద్దేశంతో వాటిని స్వేచ్ఛగా తాగుతుంటారు. కానీ, ఇలా బయట దొరికేవి తాగేప్పుడు అక్కడ ఎంత పరిశుభ్రత పాటిస్తున్నారు, ఎలాంటి నీళ్లు వాడుతున్నారులాంటివి గమనించాలి. లేకపోతే పొట్టకు లేనిపోని తంటా తెచ్చినట్టే.

### అన్నీ తాగొచ్చు

ఎండవేళ శరీరంలో నీటి స్థాయుల్ని నిలిపి ఉంచేందుకు ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కాబట్టి మంచీ చెడులతో సంబంధం లేకుండా ఏమైనా తాగొచ్చు అనుకోవడం పొరపాటు. కేవలం మజ్జిగ, కొబ్బరినీళ్ల లాంటి సంప్రదాయ ఆరోగ్యకర పానీయాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. మిల్క్‌షేక్‌లు, శీతల పానీయాల్లాంటి హై క్యాలరీ డ్రింకులను ఏ కాలంలో అయినా పక్కన పెట్టేయాల్సిందే.



# ఆటిజం.. అరువు తెచ్చుకుంటున్నం!

**మన దేశంలో ప్రతి 80మంది చిన్నారుల్లో ఒకరికి ఆటిజం సమస్య ఉండవచ్చనేది ఒక అంచనా. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఆటిజంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా ఏప్రిల్ 2న 'వరల్డ్ ఆటిజం అవేర్‌నెస్ డే' నిర్వహిస్తున్నది. అసలు ఈ ఆటిజం అంటే ఏంటి, అది ఎందుకు వస్తుంది, రావడానికి గల కారణాలేంటి? దాని లక్షణాలు, ఆటిజం వల్ల పిల్లల్లో ఎలాంటి అనారోగ్యం ఏర్పడుతుంది? ఈ సమస్యను ఎలా గుర్తించాలి, నిర్ధారణ పద్ధతులు, చికిత్సా విధానం తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.**

**ఆటిజం** అనేది బయటికి కనిపించే ఒక రకమైన మానసిక వ్యాధి లక్షణం. చాలా ఆటిజం కేసుల్లో మాటలు మొదట్లో వస్తాయి. కానీ రెండేండ్లు వచ్చేసరికి మాటలు ఆగిపోతాయి. దీనినే 'రిగ్రెషన్' అంటారు. చాలామంది పిల్లల్లో మొదటి రెండేండ్లలోపే ఇది జరుగుతుంది. ఆటిజం సమస్య ఉన్న చిన్నారుల్లో నాలుగైదు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి.

1. భావ వ్యక్తీకరణ లేకపోవడం. అది భాష పరంగా గానీ, హావభావాలు వ్యక్తపరచడంలో గానీ సమస్య ఉంటుంది. అంటే వాళ్లు సరిగ్గా మాట్లాడలేరు.
2. ఇతరుల భావాలను గ్రహించలేరు. అంతేకాదు వారి భావోద్వేగాలను వ్యక్తపర్చలేరు.
3. సామాజిక బాంధవ్యాలు తెలియదు. అంటే ఇతరులతో కలిసి ఆడుకోవడం, కలివిడిగా ఉండటానికి ఇష్టపడరు. ఒంటరిగా ఉండాలని కోరుకుంటారు.
4. చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తుంటారు.
5. ఈ చిన్నారుల్లో మానసిక పరిణతి తక్కువగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ ఆటిజం పిల్లల్లో ప్రాథమికంగా కనిపిస్తుంటాయి. ఈ సమస్యలతో సతమతమవుతున్న వారిని ఆటిజం బాధితులుగా పరిగణిస్తారు.



### కారణాలు

- ఆటిజం సమస్యకు ఒక ప్రత్యేకమైన కారణమని ఏదీ లేదు. సాధారణంగా 9 నెలల నుంచి 18 నెలలు వచ్చే వరకు పిల్లలు భావాలను వ్యక్తీకరించడంతో పాటు, గ్రహించడం, భాష నేర్చుకోవడం చేయగలుగుతారు. ఈ వయసులో చిన్నారులకు ఫోన్‌లు, టీవీ, ట్యాబ్ లాంటివి అలవాటు కావడం వల్ల భావ వ్యక్తీకరణ, భాష నేర్చుకోవడం దెబ్బతింటుంది. స్క్రీన్ టైమ్‌కి అలవాటు పడితే ఈ సమస్యలు వస్తాయి.

అమెరికన్ పీడియాట్రిక్ సొసైటీ ప్రకారం మొదటి 3 సంవత్సరాల వరకు పిల్లలను ఫోన్, టీవీకి దూరంగా ఉంచడం మంచిది. వాటికి అలవాటుపడితే ఆటిజం వచ్చే ప్రమాదం ఉందని సదరు సొసైటీ హెచ్చరించింది.

- బహుళ భాషలను నేర్చుకోవాల్సి రావడమూ పిల్లల్లో ఆటిజం సమస్యకు కారణం కావొచ్చు. చిన్నారులకు మాటలు వచ్చే క్రమంలో.. తల్లిదండ్రులు వేర్వేరు భాషల్లో మాట్లాడటం వల్ల, పిల్లలకు ఏ భాషను స్వీకరించాలో అర్థం కాదు. వాళ్లు అయోమయానికి గురై భాషపై పట్టుచిక్కకపోవడం వల్ల ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి.
- యాంటీ బయోటిక్స్ లాంటి ఔషధాలు ఎక్కువగా వాడటం కూడా ఆటిజానికి దారి తీయొచ్చు.
- ఐవీఎఫ్ ద్వారా జన్మించిన పిల్లల్లో కూడా ఆటిజం రిస్క్ కనిపిస్తున్నది.
- 18 నెలల వయసులో పిల్లలకు ఇచ్చే ఎంఎంఆర్ టీకా వల్ల కూడా ఆటిజం వస్తుందనేది ప్రజల్లో ఉన్న ఒక అపోహ మాత్రమే. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవు.

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పిల్లల పెంపకంలో పెద్దల పాత్ర అధికంగా ఉండేది. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, మేనమామ, అత్తయ్య, చిన్నాన్న, పిన్ని... ఇలా ఎవరో ఒకరు పిల్లలతో సమయం గడిపేవారు. అప్పట్లో సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌ల ఊసే లేదు. మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఎక్కువగా ఉండేది. నిరంతరం వారి మధ్య ఉండటం వల్ల పిల్లల్లో భాషా వికాసం బాగా ఉండేది. హావభావాల వ్యక్తీకరణతో పాటు మానసిక పురోగతిలోనూ వయసుకు తగ్గ పరిణతి కనిపించేది. కానీ, ఇప్పుడు ఉమ్మడి కుటుంబాల ఉనికి గణనీయంగా తగ్గిపోయింది. నూటికి 90 శాతం న్యూక్లియర్ ఫ్యామిలీలే ఉంటున్నాయి. దీనికితోడు తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం వల్ల పిల్లలు అధిక సమయం ఒంటరిగా గడపాల్సి వస్తున్నది. మనుషులతో కన్నా డిజిటల్ కమ్యూనికేషన్ ఎక్కువైంది. ఏడాది వయసున్న పిల్లలు కూడా సెల్‌ఫోన్, ట్యాబ్‌తో ఆడుకోవడం కనిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితులు సైతం ఆటిజానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు.

### రోగ నిర్ధారణ పద్ధతులు

**ప్రత్యేక** లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. ఆటిజాన్ని నిర్ధారించేందుకు ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి వైద్య పరిజ్ఞానం గానీ, రోగ నిర్ధారణ పద్ధతులు గానీ అందుబాటులో లేవు. కేవలం అనుభవజ్ఞులైన సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు మాత్రమే సమస్యను కొన్ని రకాల పరీక్షల ద్వారా నిర్ధారించగలరు.

### లక్షణాలు

- పిల్లలు తల్లిదండ్రుల కండ్లలోకి కూడా నేరుగా చూడలేకపోవడం
- పేరుపెట్టి పిలిచినా వెంటనే స్పందించకపోవడం
- ఇతర పిల్లలతో కలిసి ఆడుకోకపోవడం
- ఒంటరిగా ఉండేందుకే ఇష్టపడటం
- ఒకే రకమైన బొమ్మతో మాత్రమే ఆడుకోవడం, మరో బొమ్మ ఇస్తే తీసుకోకపోవడం
- కొందరు పిల్లల్లోనైతే స్పర్శ, వాసన, చూపు, వినికిడి వంటి జ్ఞానేంద్రియ వ్యవస్థ అసంబంద్ధంగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ మొదటి మూడు సంవత్సరాల్లోపు కనిపిస్తాయి.

### చికిత్సా పద్ధతులు

ఆటిజానికి సంబంధించిన లక్షణాలను ఎంత త్వరగా గుర్తించి, సరైన థెరపీలను అందించగలిగితే అంత మంచిది. 6 నెలల్లోనే 50 శాతం సమస్యను నివారించవచ్చు. కనీసం 3 సంవత్సరాల్లోపు సమస్యను గుర్తించి చికిత్స అందిస్తేనే ఫలితం ఉంటుంది. ఈ 3 సంవత్సరాల గోల్డెన్ టైమ్ దాటిపోతే ఎలాంటి చికిత్సలు అందించినా ఫలితం ఆశించిన మేరకు ఉండకపోవచ్చు. ఆటిజం బాధిత చిన్నారులకు ప్రధానంగా మూడు రకాల థెరపీలతో చికిత్స అందిస్తారు. అందులో 1.ఆక్యుపేషనల్ థెరపీ 2. బిహేవియర్ థెరపీ 3. స్పీచ్ థెరపీ

### 1.ఆక్యుపేషనల్ థెరపీ:

పిల్లల్లో ప్రారంభ దశలో జ్ఞానేంద్రియాలు అసంబద్ధంగా ఉన్నట్లు గుర్తిస్తే, ఆక్యుపేషనల్ థెరపీ అందించవచ్చు. దీని వల్ల ఐదు జ్ఞానేంద్రియాలు నియంత్రణలోకి వచ్చి, సమస్య దాదాపుగా పరిష్కారమవుతుంది.



### 2.బిహేవియర్ థెరపీ:

బిహేవియర్ థెరపీతో పిల్లల అసాధారణ ప్రవర్తనకు సంబంధించిన సమస్యలు పరిష్కరించవచ్చు.

### 3. స్పీచ్ థెరపీ:

ఆటిజం పిల్లల విషయంలో స్పీచ్ థెరపీ చాలా ముఖ్యమైంది. మొదటి రెండు థెరపీలు... అంటే ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీల తర్వాతే స్పీచ్ థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది.

### సలహాలు

- ప్రారంభ దశలోనే గుర్తించి నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.
- మూడేండ్లలోపు పిల్లలను బ్లూ లైట్‌కు దూరంగా ఉంచాలి. అంటే సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, టీవీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఇవ్వకూడదు.
- పిల్లలకు ఎలక్ట్రానిక్ పరికరాలు ఇచ్చి, ఒంటరిగా వదిలేయకుండా వారితో తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యులు గడపడం ఉత్తమం.





# నిద్రలోనూ సుఖం లేదు!

**శారీరక** శ్రమకు, మానసిక ఆందోళనకు చక్కని ఔషధం నిద్ర. ఆరు గంటలు ఆదమరచి నిద్దరోతే.. సమస్యలన్నీ పరారైన అనుభూతి కలుగుతుంది. కానీ, సుఖమెరుగని నిద్ర.. అతివలకు అంతగా అందడం లేదని సర్వేల సారాంశం. స్లీప్ ఫౌండేషన్ ఇచ్చిన నివేదిక.. పురుషుల కన్నా స్త్రీలు నిద్రలేమితో ఎక్కువగా బాధపడుతున్నారని తేల్చింది. ఉద్యోగం, ఇల్లు, పిల్లలు, ఇతర బాధ్యతలతో మల్టీ టాస్కింగ్ చేస్తున్న మహిళలు సరైన నిద్ర లేక సతమతమవుతున్నారని నివేదిక సారాంశం. ఇందుకు కారణాలూ లేకపోలేదు. రుతుక్రమంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్లలో హెచ్చుతగ్గులు నిద్రకు భంగం కలిగిస్తాయి. ముఖ్యంగా రుతుస్రావం ముందు, మెనోపాజ్ సమయంలో వేడి ఆవిర్లు, రాత్రి చెమటలు నిద్రను భంగపరుస్తున్నాయని పరిశోధకులు తేల్చారు. అంతేకాదు గర్భిణిగా ఉన్నప్పుడు హార్మోన్లలో చోటుచేసుకునే మార్పుల కారణంగా శారీరక అసౌకర్యం ఏర్పడుతుంది. ఇది నిద్ర నాణ్యతపై గణనీయంగా ప్రభావం చూపుతుందట. ఈ నిద్రలేమి హృదయ సంబంధ వ్యాధులు, మానసిక రుగ్మతలకు దారి తీస్తుందని ఆరోగ్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుఖనిద్రకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

# స్నానం తర్వాత బ్రషింగా?

**ఒక్కోసారి** హడావుడిగా, ఏదో ఆలోచనలో ఉండి బ్రష్ చేసుకోలేదనే విషయం మరిచిపోయి స్నానం చేసేస్తుంటాం. తర్వాత గుర్తొచ్చి అప్పుడు బ్రష్ చేసుకుంటాం. ఇది ఎప్పుడో పొరపాటున ఒకసారి జరిగితే పర్వాలేదు. కానీ, అదే అలవాటుగా మారితే మాత్రం చర్మానికి నష్టమేనని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. మనం పళ్లు తోముకున్నప్పుడు బ్యాక్టీరియా నోటి నుంచి చర్మం మీదకు చేరే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నోటి చుట్టూ, గడ్డం చుట్టూ ఇరిటేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. తర్వాత అది నెమ్మదిగా మొటిమలకు కారణమవుతుంది. బ్రష్ చేసే సమయంలో చర్మం మీదికి బదిలీ అయిన బ్యాక్టీరియా వల్ల చర్మం మీద పగుళ్లు కూడా ఏర్పడవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే స్నానానికి ముందే బ్రష్ చేసుకోవడం సురక్షితం. ఒకవేళ స్నానం తర్వాత బ్రష్ చేయాల్సి వస్తే ముఖాన్ని మరోసారి సబ్బుతో లేదా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు.



# ముందే తినేయాలి!

**రోజూ వీలైనంత త్వరగా భోజనంచేస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గుతుందట. నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 1,03,389 మంది నుంచి ఆహార విధానాలు, గుండె రక్తనాళాల జబ్బులకు సంబంధించిన సమాచారం సేకరించారు. వీరిలో 79 శాతం మంది మహిళలే. పరిశోధనలో పాల్గొన్నవాళ్ల సగటు వయసు 42 ఏండ్లు..**

**వయసు,** లింగం, కుటుంబ పరిస్థితి మొదలైన సామాజిక పరిస్థితులు, ఆహారంలో పోషకాల నాణ్యత, జీవనశైలి, నిద్రా చక్రాన్ని పరిశోధకులు పరిగణనలోకి తీసుకున్నారు. పొద్దున్నే టిఫిన్ చేయకుండా భోజనం చేసేవారిలో ఒక్కో గంట ఆలస్యానికి గుండె రక్తనాళాల వ్యాధుల తీవ్రత 6 శాతం పెరుగుతుందని పరిశోధకులు కనుక్కొన్నారు. అంటే పొద్దునే 9 గంటలకు తినే వ్యక్తికి 8 గంటలకే తిన్న వ్యక్తితో పోలిస్తే గుండె రక్తనాళాల జబ్బుల ముప్పు 6 శాతం ఎక్కువగా ఉంటుందన్న మాట. 9 తర్వాత ఒక్కో గంట గడుస్తుంటే ఈ ముప్పు 28 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. అయితే, ముందురోజు రాత్రి చివరి భోజనానికి, తర్వాతి రోజు ఉదయం భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తక్కువట. అలా ఈ పరిశోధన రోజూ పొద్దున, సాయంత్రం భోజనాలు వీలైనంత త్వరగా ముగించేయాలని వెల్లడిస్తున్నది. గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం ప్రపంచ ప్రజల్లో మరణాలకు కారణమయ్యే వ్యాధుల్లో గుండె రక్తనాళాల సమస్యలే ముందువరుసలో ఉన్నాయి.

2019లో గుండె సమస్యలతో 18.6 మిలియన్ల మంది మరణించారు. వీటిలో 7.9 శాతం మరణాలకు ఆహారపు అలవాట్లే ప్రధాన కారణంగా నిలిచాయి. అంటే... ''ఈ తరహా వ్యాధుల పుట్టుక, అభివృద్ధిలో ఆహారం కీలకపాత్ర పోషిస్తున్నదని తెలుస్తుంది. పశ్చిమ దేశాల సమాజాల ఆధునిక జీవనశైలి రాత్రి భోజనం మరీ ఆలస్యంగా చేయడం, పొద్దునే టిఫిన్ తీసుకోకపోవడం మొదలైన ఆహారపు అలవాట్లకు దారితీసింది. అయితే, ఉదయం, రాత్రి భోజనాలు వీలైనంత తొందరగా ముగించుకునే అలవాట్లను స్వీకరిస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గించుకోవచ్చు'' అని పరిశోధకులు పేర్కొన్నారు.



# గ్లైఫోసేట్.. గర్భిణులకు ముప్పు

**గ్లైఫోసేట్‌ను** పంటల్లో కలుపు నివారణకు వాడతారు. ఇది పంటలకు హాని కలిగించకుండానే కలుపును నిర్మూలిస్తుంది. కాబట్టి, రైతులు దీన్ని విస్తృతంగా వాడుతున్నారు. ఏండ్ల తరబడి జరిగిన అధ్యయనాల ద్వారా గ్లైఫోసేట్ మనుషుల్లో క్యాన్సర్‌కు కారణం కావచ్చని భావిస్తున్నారు. ఆహారం రూపంలో అంతగా హాని కలిగించనప్పటికీ గ్లైఫోసేట్ ఆధారిత రసాయనాలు మనుషులను వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. చర్మం మండుతుంది. శ్వాసిస్తే ముక్కు రంధ్రాల్లో ఇబ్బందిగా ఉంటుంది. కొన్నిసార్లయితే తీవ్రతను బట్టి కాలేయం, కిడ్నీల పనితీరును దెబ్బతీస్తుంది. మరణం కూడా సంభవించవచ్చు. అంతేకాదు... గ్లైఫోసేట్ గర్భిణుల మీద మరింత దుష్ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయం ఏ కొంచెం తగ్గినా కూడా పుట్టబోయే శిశువు జీవితంపై ప్రతికూల ప్రభావాలకు దారితీస్తుంది. పైగా బిడ్డ పుట్టకముందే శాశ్వత నష్టం కూడా జరగవచ్చు. బిడ్డ పుట్టిన తర్వాత కూడా శరీర పెరుగుదలకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి. గర్భిణులపై గ్లైఫోసేట్ ప్రభావం గురించి అమెరికాకు చెందిన 'ది ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ యూనిట్' జరిపిన సర్వేలో ఈ వివరాలు తెలిశాయి.



అధ్యయనం కోసం పరిశోధకులు 18– 40 సంవత్సరాల మధ్య వయసున్న 77 మంది మహిళల్ని ఎంచుకున్నారు. వీరిని 2015 జూన్ నుంచి 2016 జూన్ వరకు పరీక్షించారు. వీరి మూత్రం నమూనాల్లో దాదాపు 93 శాతం మందిలో గ్లైఫోసేట్ అవశేషాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నట్టు గుర్తించారు. పట్టణ మహిళలతో పోలిస్తే గ్రామీణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. మొదట్లో దీనికి కారణం నీళ్లు కావచ్చని అనుకున్నారు. కానీ కలుపు నివారణకు గ్లైఫోసేట్ వాడటం వల్ల ఆయా పంటలను ఆహారంగా తీసుకోవడంతో ఈ దుస్థితి దాపురించిందని ఇప్పుడు అనుమానిస్తున్నారు. ఇది చిన్న అధ్యయనమే అయినప్పటికీ ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలనేది పరిశోధకుల హెచ్చరిక. మరో విషయం... గర్భిణులు తమ తొలి మూడు నెలల కాలంలో ఈ కలుపు నివారిణికి దూరంగా ఉండాలంటున్నారు పరిశోధకులు. లేదంటే తల్లిపాల ద్వారా కలుపుమందు అవశేషాలు పిల్లలకు చేరుకుంటాయి. కాబట్టి, రైతులు కూడా గ్లైఫోసేట్‌కు ప్రత్యామ్నాయాలను వాడాలి. గర్భిణులు తొమ్మిది నెలలపాటు ఈ కలుపుమందు ప్రభావం అసలే పడకుండా జాగ్రత్త వహించాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

## ఇరాన్ ప్రకటనపై స్పందించిన డెల్..

### ఉద్యోగులకు ట్రావెల్ అడ్వయిజరీ జారీ




**న్యూఢిల్లీ:** ఇరాన్ ప్రభుత్వం తనను ఉగ్రవాద సంస్థగా ప్రకటించడంపై అమెరికాకు చెందిన మల్టీనేషనల్ కంపెనీ డెల్ స్పందించింది. తన ఉద్యోగుల రక్షణే ప్రథమ కర్తవ్యంగా భావిస్తూ అంతర్గతంగా ట్రావెల్ అడ్వయిజరీ జారీచేసింది. ఉద్యోగులెవరూ ఇరాన్‌కు వెళ్లవద్దని, అక్కడ ఉన్నవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించింది. ఇరాన్ సంస్థలు లేదా ఆ దేశ వ్యక్తులతో ఎలాంటి ప్రత్యక్ష, పరోక్ష వ్యాపార లావాదేవీలు పెట్టుకోవద్దని కఠిన ఆదేశాలు జారీ చేసింది.

అదేవిధంగా కంపెనీ డేటా, నెట్‌వర్క్ భద్రతపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని డెల్ తన ఐటీ విభాగాలను హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అమెరికా-ఇరాన్ ఘర్షణ ఇప్పుడు క్షిపణుల నుంచి గ్లోబల్ టెక్నాలజీ, ఫైనాన్స్ సంస్థల వైపు మళ్లినట్టుగా కనిపిస్తోంది. అమెరికాకు చెందిన 18 ప్రముఖ కంపెనీలు తమ హిట్ లిస్టులో ఉన్నాయని ఐఆర్జీసీ తన టెలిగ్రామ్ ఛానల్ ద్వారా స్పష్టంచేసింది. ఈ ఐటీ సంస్థలన్నీ అమెరికా నిఘా వర్గాలకు సమాచారాన్ని చేరవేస్తున్నాయని ఆరోపించింది.

## లెజెండ్స్ దూసుకెళుతున్నాయి...

### ఆనంద్ మహీంద్రా ఆసక్తికర పోస్ట్



**న్యూఢిల్లీ:** ఒకప్పుడు భారత రోడ్లపై రారాజులుగా వెలిగిన జావా, యెజ్డీ, బీఎస్ఏ బైక్‌లు మళ్లీ తమ హవా చూపిస్తున్నాయి. ఈ ఐకానిక్ బ్రాండ్ల అమ్మకాలు దేశీయంగా, అంతర్జాతీయంగా భారీ వృద్ధిని నమోదు చేస్తున్నాయని ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా తెలిపారు. మార్చి 2026 అమ్మకాల గణాంకాలను పంచుకుంటూ ఆయన ఈ విజయంపై హర్షం వ్యక్తం చేశారు.

ఆనంద్ మహీంద్రా వెల్లడించిన వివరాల ప్రకారం.. గత ఏడాదితో పోలిస్తే ఈ బైక్‌ల దేశీయ విక్రయాలు 115 శాతం పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ బ్రాండ్లకు ఆదరణ గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది అంతర్జాతీయ అమ్మకాలు తొలిసారిగా 1,000 యూనిట్ల మార్కును దాటి, అనేక రెట్ల వృద్ధిని నమోదు చేశాయి. గత 12 నెలల కాలంలో మొత్తం నెలవారీ విక్రయాల పరిమాణం రెండున్నర రెట్లు పెరగడం విశేషం.

ఈ సందర్భంగా ఆనంద్ మహీంద్రా స్పందిస్తూ, “లెజెండ్స్ తిరిగి వచ్చాయి, మునుపటి కంటే వేగంగా దూసుకెళుతున్నాయి” అని వ్యాఖ్యానించారు. మహీంద్రాకు చెందిన క్లాసిక్ లెజెండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ బ్రాండ్లు లాభదాయకమైన వృద్ధిని సాధిస్తున్నాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. వినియోగదారుల హృదయాలను గెలుచుకుంటూ ఈ బ్రాండ్లు ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు.

## 5 కేజీల గ్యాస్ సిలిండర్లకు అడ్రస్ ప్రూఫ్ అవసరం లేదు: కేంద్రం




**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇకపై 5 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌ను అడ్రస్ ప్రూఫ్ అవసరం లేకుండా, కేవలం ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని శనివారం స్పష్టం చేసింది. సమీపంలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల వద్ద ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని, అయితే దేశంలో పెట్రోల్, డీజిల్ లేదా ఎల్పీజీకి ఎలాంటి కొరత లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ప్రజలు ఆందోళన చెంది ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రిటైల్ ఔట్‌లెట్లు సాధారణంగా పనిచేస్తున్నాయని, తగినన్ని నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది.

ముఖ్యంగా వలస కార్మికులు, స్థానిక చిరునామా పత్రాలు లేని వారిని దృష్టిలో ఉంచుకుని 5 కేజీల సిలిండర్ నిబంధనను సరళతరం చేసినట్లు అధికారులు వివరించారు. మార్చి 23 నుంచి ఇప్పటివరకు సుమారు 5.7 లక్షల సిలిండర్లను ఈ పద్ధతిలో విక్రయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

ఇంధన సరఫరాలో స్థిరత్వాన్ని కొనసాగించడానికి దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామని, రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని కేంద్రం తెలిపింది. మరోవైపు, అక్రమ నిల్వలు, నల్ల బజారును అరికట్టేందుకు నిఘా పెంచామని, ఇటీవల 3,700కు పైగా దాడులు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. నిత్యావసర వస్తువుల చట్టం కింద చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించినట్లు పేర్కొంది.

# థ్రిల్లింగ్ పోరులో రాజస్థాన్ విజయం

### గెలుపు అంచుల వరకు వచ్చిన గుజరాత్...




**అహ్మదాబాద్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో మరో హోరాహోరీ మ్యాచ్ అభిమానులను అలరించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 6 పరుగుల స్వల్ప తేడాతో విజయం సాధించింది. భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ చివరి వరకు పోరాడినా, కీలక సమయంలో వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ (42 బంతుల్లో 75 పరుగులు; 5 ఫోర్లు, 5 సిక్సులు) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగగా, యశస్వి జైస్వాల్ (36 బంతుల్లో 55) హాఫ్ సెంచరీతో రాణించాడు. వీరిద్దరి మెరుపులతో రాజస్థాన్ పటిష్ట స్థితిలో నిలిచింది. గుజరాత్ బౌలర్లలో కగిసో రబాడ రెండు వికెట్లు తీశాడు.




అనంతరం 211 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్‌కు సాయి సుదర్శన్ (44 బంతుల్లో 73 పరుగులు; 9 ఫోర్లు, 3 సిక్సులు) అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. అతను క్రీజులో ఉన్నంతసేపు గుజరాత్ విజయం ఖాయమనిపించింది. అయితే, కీలక సమయంలో రాజస్థాన్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ తన మాయాజాలంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అతను ఒకే ఓవర్లో కీలక వికెట్లు పడగొట్టడంతో సహా మొత్తం నాలుగు వికెట్లతో గుజరాత్ మిడిలార్డర్‌ను దెబ్బతీశాడు.

చివర్లో రషీద్ ఖాన్ (24), రబాడ (23 నాటౌట్) పోరాడినా, జట్టును గెలిపించలేకపోయారు. ఆఖరి ఓవర్లో విజయానికి 11 పరుగులు అవసరం కాగా, 4 పరుగులే లభించాయి. చివరికి గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 204 పరుగులకే పరిమితమైంది.

## ఆస్ట్రేలియా వెళ్లిపోయిన ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్..

### మళ్లీ తిరిగి జట్టులోకి వస్తాడా..?

**న్యూఢిల్లీ:** సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్టు ఫుల్‌టైమ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తన స్వదేశమైన ఆస్ట్రేలియా తిరిగి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అయితే, ఆయన త్వరలోనే తిరిగి వస్తారని ఎస్ఆర్‌హెచ్ వర్గాలు తెలిపాయి. ఆస్ట్రేలియా కెప్టెన్ అయిన ప్యాట్ కమిన్స్ ఐపీఎల్‌లో ఎస్ఆర్‌హెచ్ టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఆయన కొంతకాలంగా వెన్నునొప్పి సమస్యతో బాధపడుతున్నారు. ఈ కారణంగానే ఇటీవల ఆస్ట్రేలియా ఆడిన టీ20 వరల్డ్ కప్ సహా అంతర్జాతీయ మ్యాచులకు దూరమయ్యాడు.

ఇప్పుడు ఐపీఎల్‌లో కూడా కొన్ని మ్యాచులకు దూరం కానున్నాడు. ఇప్పటికే మొదటి రెండు మ్యాచుల్లో ఆడలేదు. అతడికి సమస్య ఉన్నప్పటికీ, ఇప్పటిదాకా ఎస్ఆర్‌హెచ్ జట్టుతోనే ఉన్నాడు. టోర్నీ ప్రారంభానికి ముందే జట్టుతో చేరాడు. నెట్స్‌లో ప్రాక్టీస్ కూడా చేస్తున్నాడు. అయితే, తాజాగా అతడు ఆస్ట్రేలియా తిరిగి వెళ్లినట్లు తెలుస్తోంది. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) నిబంధనల మేరకు కమిన్స్ ఆ దేశం తిరిగి వెళ్లాడు. అతడు ఏ టోర్నీలో ఆడాలన్నా సీఏ అనుమతి తప్పనిసరి. ఇందుకోసం అతడు ఫిట్‌నెస్ నిరూపించుకోవాలి. దీనికోసం అక్కడ వైద్య పరీక్షలకు హాజరవ్వాలి. ఈ నేపథ్యంలో వెన్ను నొప్పితో బాధపడుతున్న కమిన్స్‌కు వైద్య



పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఆస్ట్రేలియా వెళ్లిన కమిన్స్ అక్కడ సీఏ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేయించుకుంటారు. కమిన్స్ పూర్తిగా కోలుకున్నట్లు భావిస్తే ఐపీఎల్‌లో ఆడేందుకు సీఏ అనుమతిస్తుంది. ప్రస్తుతం కమిన్స్ కోలుకున్నట్లు తెలుస్తోంది. అక్కడ పరీక్షల అనంతరం సీఏ అనుమతితో ఐపీఎల్‌లో ఆడుతాడు.

ఏప్రిల్ 17న కమిన్స్ తిరిగి ఎస్ఆర్‌హెచ్ జట్టుతో చేరుతాడు. ఆ తర్వాత జరిగే మ్యాచులకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. సీఏ అనుమతి లేకుండా, అనారోగ్యంతో ఉన్నప్పుడు ఇతర టోర్నీల్లో ఆడితే అతడిపై సొంత జట్టైన సీఏ చర్యలు తీసుకుంటుంది. అందుకోసమే అక్కడికి వెళ్లి తగిన అనుమతులతో కమిన్స్ ఐపీఎల్‌లో అడుగుపెడతాడు. ఎస్ఆర్‌హెచ్.. తాజా ఐపీఎల్‌లో రెండు మ్యాచులు ఆడింది. ఒక దానిలో విజయం సాధించింది. మిగతా మూడు మ్యాచులకు కమిన్స్ దూరంగా ఉంటాడు. ఆ తర్వాతి మ్యాచులకు అందుబాటులోకి వస్తాడు.

## నేను సౌరవ్ గంగూలీని కాదేమో.. కానీ కచ్చితంగా బెంగాలీనే

### టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్

**పశ్చిమబెంగాల్:** భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ బెంగాలీ కాదంటూ వస్తున్న విమర్శలపై ఆయన స్పందించారు. తాను సౌరవ్ గంగూలీ ని కాదేమోగానీ కచ్చితంగా బెంగాలీనే అని చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల బీజేపీలో చేరిన సౌత్ క్లబ్‌లో ప్రారంభమైందని చెప్పారు. ఇక్కడి లా మార్టినియర్ పాఠశాలలో చదువుకున్న తాను, కోల్‌కతా నగర మైదానాల్లోనే ఆడుకున్నానని అన్నారు. ఈ నగరానికి గొప్ప క్రీడా చరిత్ర ఉందని కొనియాడారు. కానీ ప్రస్తుత బెంగాల్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడం లేదని విమర్శించారు.



పేస్.. ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ కార్యక్రమాలకు వెళ్లినప్పుడు ‘మీరు బెంగాలీయేనా’ అనే ప్రశ్నలు ఎదుర్కొంటున్నారు. దీనపై పేస్ స్పందిస్తూ.. మీరు బెంగాలీయేనా అనే ప్రశ్న ఎదురైనప్పుడు తనకు చాలా బాధగా ఉంటుందని అన్నారు. అయితే తన కుటుంబానికి పోర్చుగీస్ మూలాలు ఉన్నాయని తెలిపారు. తనవి మాత్రం భారతీయ మూలాలే అని స్పష్టంచేశారు. తాను కోల్‌కతాలో పుట్టానని, తన టెన్నిస్ ప్రయాణం

పోయిన సంవత్సరం అర్జెంటినా ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సీ కోల్‌కతాలో పర్యటించిన సమయంలో చోటుచేసుకున్న గందరగోళాన్ని ఈ సందర్భంగా పేస్ ప్రస్తావించారు. బెంగాల్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని సరిగ్గా నిర్వహించలేదని ఆరోపించారు. క్రీడారంగానికి చెందినవారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ఉంటే పరిస్థితులు మరోలా ఉండేవని అభిప్రాయపడ్డారు.

# నేనేమైనా ఓవర్‌సీస్ ప్లేయర్‌నా..

### నన్నెందుకు అడుగుతున్నారు: విరాట్ కోహ్లీ

**బెంగుళూరు:** రాయల్ చాలెంజర్స్ బెంగుళూరు ప్లేయర్ విరాట్ కోహ్లీపై సోషల్ మీడియా వెరైటీ రూమర్స్ నడుస్తున్నాయి. ఆర్సీబీ జట్టులో అయిదుగురు విదేశీ ప్లేయర్లు ఉన్నారని, దాంట్లో విరాట్ కోహ్లీ కూడా ఒకరని ఆన్‌లైన్‌లో ట్రోల్స్ జరుగుతున్నాయి. చాన్నాళ్ల నుంచి విరాట్ లండన్‌లోనే ఉంటున్న విషయం తెలిసిందే. దీంతో అతనిపై ఆ పుకార్లు పుట్టాయి. అయితే ఆర్సీబీ క్రికెటర్ విరాట్ కోహ్లీ దీనిపై క్లారిటీ ఇచ్చారు. తనపై వస్తున్న జోక్స్ అతను చెక్ పెట్టేశాడు. తానేమీ ఓవర్‌సీస్





ప్లేయర్ కాదన్నారు. ఆర్సీబీ హోస్ట్ దనిష్ సైత్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతను ఈ విషయాన్ని చెప్పాడు. ఆర్సీబీ జట్టులో అయిదుగురు విదేశీ క్రికెటర్లు ఉన్నారని విమర్శలు వస్తున్నట్లు హోస్ట్ అడిగిన ప్రశ్నకు కోహ్లీ సమాధానం ఇచ్చాడు. ఆ ప్రశ్నకు కోహ్లీ నవ్వుతూ.. నాకు తెలియదు, నన్ను ఎందుకు అడుగుతున్నారు, విదేశీ ఆటగాళ్లను అడగండి, నేనేమీ విదేశీ ప్లేయర్‌ను కాదు, నేనేమైనా ఓవర్‌సీస్ ప్లేయర్‌నా అని కోహ్లీ ఎదురు ప్రశ్న వేశారు.

2026 ఐపీఎల్‌లో హైదరాబాద్‌తో జరిగిన ఫస్ట్ మ్యాచ్‌లో కోహ్లీ 38 బంతుల్లో 69 రన్స్ చేశాడు. ఆ ఇన్నింగ్స్‌లో అతను అయిదు సిక్సర్లు, నాలుగు ఫోర్లు కొట్టాడు. ప్రస్తుతం కోహ్లీ టాప్ ఫామ్‌లో ఉన్నట్లు కనిపిస్తున్నాడు. కానీ, అతను జనవరిలో చివరి వన్డే ఆడిన తర్వాత నేరుగా లండన్‌కు వెళ్లిపోయాడు. అక్కడే అతను తన ఫ్యామిలీతో కలిసి ఉంటున్నాడు. ఇండియాను అతను రాలేదు. దీంతో కోహ్లీ ఓ విదేశీ ప్లేయర్ అయిపోయినట్లు సోషల్ మీడియాలో అతనిపై విమర్శలు వచ్చాయి. ఇక గత ఏడాది ఐపీఎల్ ట్రోఫీని సొంతం చేసుకున్న తర్వాత తన మనసు తేలికైందన్నారు. అయితే వంద శాతం ఫిట్‌నెస్ లేకుంటే తాను క్రికెట్ మైదానంలో అడుగుపెట్టబోనన్నాడు. 120 శాతం ఫిట్‌నెస్‌తోనే ఆడనున్నట్లు తెలిపాడు. ఎక్స్‌ట్రా రెస్ట్ తీసుకున్నానంటే, అది తనను మానసికంగా బలోపేతం చేస్తుందని అన్నారు.

## 10న విడుదలవనున్న డెకాయిట్

### ట్రైలర్ విడుదల చేసిన చిత్ర బృందం




**టాకీస్:** అడివి శేష్ హీరోగా రానున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ 'డెకాయిట్' షానీల్ డియో దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. ఏప్రిల్ 10న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద తనకంటూ ఒక ప్రత్యేక బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న హీరో అడివి శేష్. తన తదుపరి చిత్రం 'డెకాయిట్' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మృణాల్ ఠాకూర్‌తో ఆయన కెమిస్ట్రీ ఈ సినిమాకు మెయిన్ హైలైట్ కానుంది. ఈ చిత్రంతో ఏప్రిల్ 10న విడుదల కాబోతున్న తరుణంలో శేష్ వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటు న్నారు. ఇందులో భాగంగా ఓ ఇంట ర్వ్యూలో తన సినీ ప్రయాణంలోని కీలక విషయాలను పంచుకున్నా రు. ముఖ్యంగా తన సినిమా లను నమ్మి పెట్టుబడి పెట్టిన నిర్మాతలకు ఇప్పటివరకు నష్టాలు రాలేదని ఆయన గర్వంగా చెప్పుకొచ్చారు. 'ఇప్పటివరకు నాతో పని చేసిన ప్రొడ్యూసర్స్ అందరూ లాభాలు గడించారు. వాళ్ళు పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని నేను నమ్ముతున్నాను' అని శేష్ పేర్కొన్నారు. కేవలం నటుడిగానే కాకుండా, స్క్రిప్ట్ విషయంలో కూడా శేష్ తీసుకునే జాగ్రత్తలే ఆయన సినిమాల మినిమమ్ గ్యారెంటీ సక్సెస్‌కు కారణమని ఇండస్ట్రీ టాక్. అలాగే తన కెరీర్‌లో మర్చిపోలేని సినిమా గురించి ప్రస్తావిస్తూ.. గూఢచారి నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ సినిమా ఇచ్చిన సక్సెస్ వల్లే ఈరోజు నేను ఇలాంటి భారీ ప్రాజెక్టులు చేయగలుగుతున్నాను' అని ఎమోషనల్ అయ్యారు. ఆ సినిమాతో వచ్చిన గుర్తింపు శేష్‌ను కేవలం తెలుగులోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో ఒక నమ్మకమైన హీరోగా నిలబెట్టిందన్నారు.




## MOVIE TIME

## ఎల్లమ్మ కథకు దేవిశ్రీ అయితేనే సరిపోతాడు

### క్లారిటీ ఇచ్చిన దర్శకుడు బలగం వేణు




**టాకీస్:** 'బలగం' సినిమాతో ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న దర్శకుడు వేణు ఎల్దండి తన తదుపరి ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'తో మరోసారి భారీ అంచనాలను సృష్టిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే ఇండస్ట్రీలో హాట్ టాపిక్ నడుస్తోంది. ఈ సినిమాలో హీరోగా నాని, నితిన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వంటి స్టార్స్ నటిస్తారని గతంలో ప్రచారం జరిగింది. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, దర్శకుడు వేణు ఈ పాత్ర కోసం దేవి శ్రీ ప్రసాద్‌ని ఎంపిక చేశారు. ప్రపంచ వ్యాప్తంగా సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రంతో హీరోగా కొత్త ప్రయాణం ప్రారంభించ బోతున్నారు. ఇది ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ఈ నిర్ణయంపై వస్తున్న సందేహాలకు దర్శకుడు వేణు క్లారిటీ ఇచ్చారు. సినిమాలో తీసుకునే ప్రతి నిర్ణయం కథకు అనుగుణంగానే ఉంటుంది. 'ఎల్లమ్మ' కథకు ఒక ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్ ఉన్న వ్యక్తి కావాలి. మొదట వేరే నటులను అనుకున్నా? కథ మారుతూ ఉండటంతో దేవి శ్రీ ప్రసాద్ అయితేనే సరిపోతారని భావించాం అని తెలిపారు. కథలోని సహజత్వం , భావోద్వేగాలను ప్రేక్షకులకు బలంగా చేరవేయడానికి దేవి సరైన ఎంపికగా కనిపించారని ఆయన వివరించారు. బలగంతో గ్రామీణ భావోద్వేగాలను అద్భుతంగా చూపించిన వేణు? 'ఎల్లమ్మ'లో కూడా అదే మట్టి వాసనను తెరపై ఆవిష్కరించబోతున్నారు. ఈ సినిమా కూడా ఎమోషనల్ డ్రామాగా ఉండబోతుందని సమాచారం. సంగీత దర్శకుడిగా ఎనలేని క్రేజ్ సంపాదించిన దేవి శ్రీ ప్రసాద్‌ని నటుడిగా ఎలా చూపిస్తారు? ఆయన పాత్రలో ఎంతవరకు ఒదిగిపోతారు? అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. టాలీవుడ్‌లో కొత్త ప్రయోగాలలు ఎప్పుడు అందరిలో ఆసక్తిని కలిగిస్తుంటాయనే విషయం మనకు తెలిసిందే. ఈ క్రమంలో వేణు దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్ ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# రష్మిక ఖాతాలో మరో అరుదైన ఘనత..

### అంతర్జాతీయ వేదికపై మెరవనున్న తెలుగింటి కోడలు..

**టాకీస్:** నేషనల్ క్రష్ రష్మిక మందన్న గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఎలాంటి బ్యాగ్రౌండ్ లేని ఓ సాధారణ అమ్మాయి ఇప్పుడు పాన్ ఇండియా అగ్ర కథానాయికగా బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో దూసుకుపోతుంది. తెలుగు, తమిళం, హిందీ భాషలలో వరుస సినిమాలతో అలరిస్తుంది. ప్రస్తుతం ఈ అమ్మడు ఖాతాలో ఓ అరుదైన ఘనత వచ్చి చేరింది. పాన్ ఇండియా అగ్ర కథానాయికగా తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది రష్మిక మందన్నా. అభిమానులు ముద్దుగా నేషనల్ క్రష్ అంటూ పిలుచుకునే ఈ అమ్మడు ఇటీవలే వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది. చాలా కాలంగా విజయ్ దేవరకొండతో ప్రేమలో ఉన్న రష్మిక.. ఈ ఏడాది ఇరు కుటుంబ సమక్షంలో పెళ్లి చేసుకుంది. ఇప్పుడు రష్మిక తెలుగింటి కోడలు. మరోవైపు ఇటీవలే ఉత్తమ నటిగా గద్దర్ ఫిల్మ్ అవార్డు అందుకుంది రష్మిక. తాజాగా మరో అంతర్జాతీయ ఘనత సొంతం చేసుకున్నారు. జపాన్ వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకమైన క్రంచీరోల్ యానిమే అవార్డుల వేడుకలో వరుసగా రెండోసారి ప్రెజంటర్ గా వ్యవహరించే అరుదైన అవకాశం దక్కించుకుంది. గతంలో 2024లో ఈ వేదికపై మెరిసింది రష్మిక. ఇప్పుడు మరోసారి సందడి చేయనుంది. రెండుసార్లు ఈ గౌరవం పొందిన తొలి భారతీయ సినీ సెలబ్రెటీగా రికార్డు క్రియేట్ చేసింది రష్మిక. యానిమేటెడ్ చిత్రాలు, వెబ్ సిరీస్ లలో ప్రతిభ కనబరిచిన వారికి ఇచ్చే ఈ పురస్కారాల 10వ ఎడిషన్ వేడుక మే 23న టోక్యోలో ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా హాలీవుడ్ ప్రముఖులతో కలిసి ఆమె విజేతలకు అవార్డులను అందజేయనున్నారు. పుష్ప సినిమాలోని శ్రీవల్లి పాత్రతో రష్మికకు జపాన్ లో భారీ క్రేజ్ ఏర్పడింది. ఇంటర్నేషన ల్ లెవల్లో రష్మికకు భారీగా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందన్న సంగ తి తెలిసిందే. ఇటీవలే యానిమల్, పుష్ప 2, కుబేర, గర్ల్ ఫ్రెండ్, థామా వంటి చిత్రాలతో వరుస హిట్స్ అందుకున్న ఆమె.. ప్రస్తుతం మైసా, రణబాలి చిత్రాల్లో నటిస్తున్నారు. రణబాలి చిత్రంలో మరోసారి విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ చిత్రాలు సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో సారి వీరిద్దరి కాంబో రిపీట్ కాబో తుండడంతో రణబాలి చిత్రంపై మరింత ఆసక్తి నెలకొం ది. మైసా, రణబాలి సినిమాలు త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

## అల్లరి నరేశ్ 'కనక దుర్గ' గ్రాండ్ లాంచ్..

**టాకీస్:** టాలీవుడ్ అల్లరోడు అల్లరి నరేశ్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం కనక దుర్గ ఘనంగా ప్రారంభమైంది. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు మెగాస్టార్ కుటుంబం తరపున సురేఖ ముఖ్య అతిథిగా హాజరై కెమెరా స్విచ్ ఆన్ చేసి చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆమె సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం చిత్ర యూనిట్‌కు మంచి శుభారంభంగా మారింది. ఈ వేడుకలో సినీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా దిల్ రాజు కుటుంబ సభ్యులు ఆయన భార్య తేజస్విని, కుమార్తె హన్షిత రెడ్డి, అలాగే స్వప్న దత్, అల్లరి నరేశ్ భార్య విరూప తదితరులు ఒకే వేదికపై కనిపించడం ఆకర్షణగా నిలిచింది.






'కనక దుర్గ' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం కథ పరంగా బలమైన కంటెంట్‌తో రూపొందుతున్నట్లు సమాచారం. అల్లరి నరేశ్ తన కెరీర్‌లో మరోసారి కొత్త కోణాన్ని చూపించబోతున్నారని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కామెడీకి ప్రసిద్ధి చెందిన ఆయన, ఇటీవలి కాలంలో విభిన్న పాత్రలను ఎంచుకుంటూ నటుడిగా తన పరిధిని విస్తరించుకుంటున్నారు. ప్రారంభోత్సవానికి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ గ్రాండ్ లాంచ్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. చిత్ర యూనిట్ త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. కథ, నటీనటులు, టెక్నికల్ టీమ్‌పై మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. మొత్తానికి, కనక దుర్గ చిత్రం ప్రారంభ దశ నుంచే మంచి బజ్ సృష్టించడంతో, అల్లరి నరేశ్ అభిమానులు ఈ సినిమాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.గత కొంత కాలంగా అల్లరి నరేశ్‌కి సరైన హిట్స్ పడడం లేదు. ఈ క్రమంలో ఈ మూవీ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

### రాముడు, పరశురాముడు..

## రెండూ రణ్‌బీర్ కపూరే

### ద్విపాత్రాభినయం గురించి వెల్లడించిన రణ్‌బీర్

**టాకీస్:** ప్రకటించిన నాటినుంచే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది 'రామాయణ'. ఇటీవల దీని టీజర్ విడుదలై మంచి స్పందనను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి రణ్‌బీర్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఇందులో ఆయన ద్విపాత్రాభినయం చేసినట్లు తెలిపారు. ఇందులో రణ్‌బీర్ శ్రీరాముడితో పాటు పరశురాముడి పాత్రను కూడా పోషిస్తున్నట్లు స్వయంగా వెల్లడించారు. 'శ్రీ మహావిష్ణువు ఆరో అవతారం పరశురాముడు. ఈ సినిమాలో శ్రీరాముడితో పాటు పరశు రాముడిగా కూడా నటించే అవకాశం రావడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నా. ఇలాంటి సినిమాల్లో నటించేటప్పుడు బాడీ లాంగ్వేజ్ మాత్రమే కాదు.. ఆ పాత్రల వెనక ఉన్న ఆధ్యాత్మికతను, భావోద్వేగాలను లోతుగా అర్థం చేసుకోవడం ముఖ్యం. 'రామాయణ' చిత్రీకరణకు ముందు ఏడాది పాటు ఆ పాత్రల గురించి బాగా తెలుసుకున్నానని రణ్‌బీర్ తెలిపారు.ప్రస్తుతం 'రామాయణ'కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమా కోసం ఓ ఓటీటీ సంస్థ భారీ డీల్‌కు ముందుకు వచ్చిందిట. కానీ, నిర్మాత నమిత్ మల్హోత్రా ఆ డీల్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. రెండు భాగాలకు కలిపి ఓటీటీ సంస్థ రూ.1000 కోట్లకు అడగ్గా.. ఆయన దాన్ని తిరస్కరించారట. ఈ డిజిటల్ హక్కుల విషయంలో ఆయన 'ధురంధర్' చిత్రబృందం వ్యూహాన్ని అనుసరించాలని చూస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. మొదట పార్ట్ వన్‌తో డీల్ కుదుర్చుకుని అది విడుదలైన తర్వాత దానికి వచ్చిన స్పందనను బట్టి రెండో భాగానికి ఒప్పందం కుదుర్చుకోవచ్చని నిర్మాత భావిస్తున్నట్లు సమాచారం. రూ.4000 కోట్లతో అత్యంత భారీ బ్జడెట్‌తో ఈ ప్రాజెక్ట్ రానుంది. ఇప్పటికే మొదటి భాగం చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం దాని వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి. రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.